హార్సీహిల్స్‌పైన అంగుళం స్థలం రాందేవ్ బాబాకి ఇచ్చిన పోరాటం తప్పదు

వార్త మెయిన్‌లో..

వార్త మెయిన్‌లో..



విశాలాంధ్ర

వైఎస్ఆర్ కడప జిల్లా | అన్నమయ్య జిల్లా

సోమవారం, 30 జూన్ 2025 | 8 పేజీలు

అర్జీలపై సమాచారానికి 1100

విశాలాంధ్ర-రాయచోటి: ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు ఈనెల 30న సోమవారం ఉదయం 10 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమాన్ని అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటితో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలను జిల్లా కలెక్టరేట్ కు వచ్చే అవసరం లేకుండా మీకోసం. వెబ్సైట్ నందు నమోదు చేసుకోవచ్చని, వారి యొక్క అర్జీల నమోదు, నమోదైన అర్జీల యొక్క ప్రస్తుత స్థితికి సంబంధించిన సమాచారాన్ని తెలుసుకునేందుకు 1100 నెంబర్ను సంప్రదించగలరని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీదారులు తమ అర్జీలను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు.

ప్రైవేటు పాఠశాలల ఇష్టారాజ్యం..!

- కొరవడిన విద్యాశాఖ పర్యవేక్షణ
- విద్యార్థులకు కనీస వసతులు నిల్
- ప్రమాణాలు పాటించని పాఠశాలలెన్నో
- అరకొర జీతాలతో ఉపాధ్యాయుల వెట్టి చాకిరి
- మానసిక క్షోభతో విద్యార్థులు

2 లో

విశాలాంధ్ర-రాజంపేట: నేటి బాలలే.. రేపటి పౌరులు అనే సూక్తి అక్షర సత్యం. ఆ పౌరుల చేతిలోనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. బాలలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలంటే పాఠశాల విద్య పునాదిగా ఉంటూ.. ఉత్తమ గురువుల శిక్షణలో, మహోన్నతమైన వ్యక్తిత్వ ప్రమాణాలతో తీర్చిదిద్దాల్సి ఉంటుంది. కానీ నేటి పోటీ ప్రపంచంలో తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల కంటే ప్రైవేటు పాఠశాలల్లో నే విద్యనభ్యసించడానికి మక్కువ చూపుతున్నారు. కానీ పుట్టగొడుగుల్లా వ్యాప్తి చెందిన ప్రైవేటు పాఠశాలల్లో ర్యాంకులు, మార్కులు తప్ప పిల్లల మానసిక వికాసానికి సంబంధించి ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. శారీరకంగా ఆరోగ్యంగా ఉంటేనే మానసికంగా ఉత్సాహంగా ఉంటారు. కానీ అనేక పాఠశాలల్లో క్రీడా మైదానాలు లేవు. శిక్షణ పొంది అర్హత కలిగిన వ్యాయామ ఉపాధ్యాయులు లేరు. మరి కొన్ని పాఠశాలల్లో క్రీడలకు సంబంధించిన పీరియడ్లు లేవు. మరికొన్ని చోట్ల క్రీడా మైదానాలు ఉన్నా అవి కేవలం సమావేశాలకు మాత్రమే పరిమితమయ్యాయి. దీనితో ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థులు అనేక మానసిక, శారీరక రుగ్మతలకు లోనవుతున్నారు. తమ పిల్లల మానసిక వికాసం కోసం తల్లిదండ్రులు తమ పిల్లల్ని యోగ, మార్షల్ ఆర్ట్స్, ఈత వంటి వాటిల్లో శిక్షణ ఇప్పించాలని చూసినప్పటికీ ప్రైవేటు పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ పాఠశాలల కంటే ఇంకో గంట ముందుగానే పాఠశాలలు ప్రారంభించడం, స్టడీ అవర్స్ అని.. ఉదయం కానీ, సాయంత్రం కానీ

రుణం.. ఎందుకింత జాప్యం?

- గత ఫిబ్రవరిలో కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు
- నేటికీ మంజూరు కాని నిధులు
- బ్యాంకులు, కార్యాలయాల చుట్టూ అభ్యర్థుల ప్రదక్షిణలు
- సమాధానం చెప్పలేకపోతున్న బ్యాంకర్లు, అధికారులు
- ఆందోళన చెందుతున్న అభ్యర్థులు

విశాలాంధ్ర-గాలివీడు: నిరుద్యోగ యువత తమ కాళ్లపై తాము నిలబడాలన్న ఉద్దేశంతో వారికి కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాలు ఇస్తున్నట్లు కూటమి ప్రభుత్వం పెద్దఎత్తున ప్రచారం చేసింది. వేలాది మంది నిరుద్యోగ యువత సబ్సిడీ రుణాల కోసం ఎదురు చూస్తుండగా గాలివీడు మండలానికి బీసీ,కాపు, ఈబీసీ కార్పొరేషన్లకు 109యూనిట్లు కేటాయించారు. సబ్సిడీ రుణాలు మంజూరైతే ఏదైనా యూనిట్ ఏర్పాటు చేసుకుని తమ కాళ్లపై తాము నిలబడవచ్చని యువత భావించారు.దీంతో నిరుద్యోగ యువత ఎన్నో ఆశలు పెట్టుకుని ఆన్లైన్లో సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. 109 యూనిట్లకు గాను 513మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 217మంది ఇంటర్వ్యూకు హాజరయ్యారు. అభ్యర్థులకు ఈ ఏడాది ఫిబ్రవరిలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంతో ఆర్భాటంగా ఇంటర్వ్యూలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి అభ్యర్థులు భారీ ఎత్తున తరలివచ్చారు. సుదూర గ్రామాల నుంచి అభ్యర్థులు ఎంతో వ్యయప్రయాసలకోర్చి ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. కూటమి ప్రభుత్వ పెద్దల సిఫారసులు ఉన్నవారికే రుణాలు ఇస్తారన్న కారణంగా కొందరు అభ్యర్థులు రుణాలపై ఆశలు వదులుకున్నారు. మరికొందరు మాత్రం ఇంటర్వ్యూలు ముగిసినప్పటి నుంచి తమకు సబ్సిడీ రుణాలు ఎప్పుడు వస్తాయా.. అని ఆశగా ఎదురు చూస్తున్నారు.

అభ్యర్థుల ఆశలపై నీళ్లు చల్లినట్టేనా..?

ఎంతో ఆర్భాటంగా సబ్సిడీ రుణాల కోసం నిర్వహించిన ఇంటర్వ్యూలు హుళక్కేనా అనే సందేహాలు తలెత్తుతున్నాయి. ఇంటర్వ్యూల ప్రక్రియ ముగిసిన తర్వాత కొద్ది రోజులకే మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది అర్హుల జాబితాను సిద్ధం చేసి బ్యాంకర్లకు పంపించారు. అయితే లబ్ధిదారుల ఖాతాలో సబ్సిడీ జమ అయితే కానీ రుణాలు మంజూరు చేయని పరిస్థితిలో బ్యాంకర్లు ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో ఐదు నెలలుగా లబ్ధిదారులు బ్యాంకులు, మండల పరిషత్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. నిధులు లేని కారణంగానే ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వడంలో జాప్యం చేస్తున్నట్లు కొందరు అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం.

ఆశగా ఎదురుచూస్తున్నా..

ఫిబ్రవరి నెలలో నిర్వహించిన ఇంటర్వ్యూకు హాజరయ్యాను. దరఖాస్తుతో పాటు సర్టిఫికెట్లను పరిశీలించి తర్వాత సమాచారం ఇస్తామని పంపించారు. సబ్సిడీ రుణం వస్తే సొంతంగా వ్యాపారం చేసుకోవాలనుకున్నాను. సబ్సిడీ ఋణానికి నన్ను ఎంపిక చేశారు.సబ్సిడీ రుణం ఇస్తారని ఎదురు చూస్తున్నాను.

- నచ్చు భాస్కర్ యాదవ్, శెట్టివారిపల్లె, గాలివీడు

అర్హుల జాబితాను బ్యాంకులకు పంపించాం..

కార్పొరేషన్ రుణాలకు సంబంధించిన ఇంటర్వ్యూలు ముగిసిన వెంటనే అర్హుల జాబితాను సిద్ధం చేశాం. అన్ని బ్యాంకులకు ఈ జాబితాను పంపించడంతో మా పని పూర్తయింది. రుణాలు మంజూరు చేయాల్సిన బాధ్యత బ్యాంకర్లపైనే ఉంది.

- చంద్రమౌళీశ్వర్, ఎంపీడీఓ, గాలివీడు



ఆరోగ్య వరప్రదాయిని.. ఈత పండ్లు

విశాలాంధ్ర-పులివెందుల: ఈత పండ్లను ఆరోగ్య వరప్రదాయిని అని అంటారు. సహజ సిద్ధంగా లభించే వీటిని చూస్తే ప్రతి ఒక్కరికీ నోరూరిస్తాయి. కాస్త వగరు కాస్త తీపి ఉన్నా తినడానికి భలే రుచిగా ఉంటాయి. సమయము సందర్భము రావడంతో అవి మార్కెట్లో దర్శనమిస్తున్నాయి. నిజం చెప్పాలంటే మధ్య మర్యాద ప్రేమతో అనుకరింపులు ఆహ్లాదకరమైన వాతావరణం, కలుషితం లేని ప్రకృతి నుండి వచ్చే గాలి ఎలా ఉంటాయో, ప్రకృతి ఒడిలో పండ్లు కూడా రంగా ఉంటాయి. వేసవికాలంలో వచ్చే ప్రకృతి ప్రసాదించిన ఈత పండ్లు ఒకటి. మందులు లేకుండానే సహజ సిద్ధంగా ప్రతి ఏటా ఇవి వేసవిలో కాపు కాస్తుంటాయి. ఎండాకాలంలో మాత్రమే లభిస్తాయి. ఈత పండ్లు తినడం వల్ల ఉపయోగాలు ఉన్నాయని వైద్యులు చెబుతున్నారు. ఈత పండ్లను ఎల్లో బెర్రీస్ అని కూడా పిలుస్తారు వీటిని చిన్నారులు మొదలుకొని పెద్దల వరకు తినవచ్చు. అంతేకాకుండా ఈత పండ్లలో ఉండే గ్లూకోస్, సుక్రోస్, ఫక్రోస్ వంటి విటమిన్లు ఆరోగ్యానికి మేలు చేస్తాయి. వీటిని ప్రతిరోజు ఉదయం పూట తినడం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుందని డాక్టర్లు చెబుతున్నారు. ముఖ్యంగా క్యాన్సర్ రాకుండా చేస్తాయి. ఈత పండ్లలో ఐరన్ సమృద్ధిగా ఉంటుంది. దీనివల్ల రక్త వృద్ధి జరుగుతుంది శరీరంలో రోగ నిరోధక శక్తి పెరగడానికి ఈత పండ్లు ఎంతో ఉపయోగపడతాయని డాక్టర్లు తెలిపారు. సాధారణంగా ఈత చెట్లు వంకలు వాగులు తదితర ప్రాంతాల్లో దర్శనమిస్తాయి.

2 లో

ప్రైవేట్ పాఠశాలల ఇష్టారాజ్యం

మొదటి పేజీ తరువాయి

పిల్లలకు విశ్రాంతి లేకుండా తరగతులు నిర్వహిస్తుండడంతో తల్లిదండ్రులు కూడా చేసేదేమీలేక ప్రైవేటు పాఠశాలల నియమ నిబంధనలకు అనుగుణంగానే నడుచుకుంటూ పిల్లల్ని యంత్రాలుగా మారుస్తున్నారు. కనీసం ఆదివారాలు, పండుగ దినాలలో కూడా తరగతులు నిర్వహిస్తూ ప్రైవేటు పాఠశాలలు తమ ఆగడాలను కొనసాగిస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తూ పిల్లలకు కావాల్సిన మౌలిక వసతులను సమకూర్చడంలో ప్రైవేటు పాఠశాలలు వెనకడుగు వేస్తున్నాయి. రాజంపేట మండలం లో ఏ ఒక్క ప్రైవేటు పాఠశాలలో కూడా ఫీజులకు సంబంధించి చార్ట్ బోర్డును ఏర్పాటు చేయలేదు. విద్యా హక్కు చట్టాన్ని తుంగలోకి తొక్కుతూ ప్రైవేటు పాఠశాలలు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నప్పటికీ పాఠశాలల పైన చర్యలు తీసుకోవడంలో విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

అరకొర జీతాలతో ఉపాధ్యాయుల వెట్టిచాకిరి

ప్రైవేటు పాఠశాలల్లో ఉపాధ్యాయుల పరిస్థితి ఎంతో దయనీయంగా ఉంది. ప్రతి సంవత్సరం వేలాది మంది ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసుకుని ప్రభుత్వ ఉద్యోగాలు లేక ఉపాధి కోసం ప్రైవేటు పాఠశాలలను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా భావించిన ప్రైవేటు పాఠశాలలు అరకొర జీతాలు ఇస్తూ వారి చేత వెట్టి చాకిరి చేయించుకుంటున్నారు. రోజు రోజుకి నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయి.. పాఠశాలల్లో ఫీజులు పెరుగుతున్నాయి కానీ., ప్రైవేట్ ఉపాధ్యాయుల జీతాలు మాత్రం పెరగడం లేదు. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8గంటల వరకు వెట్టి చాకిరి చేయించుకుంటూ అరకొర జీతాలతో సరిపెట్టేస్తున్నారు. ఆదివారాలు, పండగ దినాలలో పాఠశాలలకు సెలవులు ఉన్నప్పటికీ ఉపాధ్యాయులు మాత్రం తప్పనిసరిగా పాఠశాలకు హాజరవ్వాల్సిందే. లేదంటే జీవితంలో కోత విధిస్తామంటూ హుకుం జారీ చేస్తారు. రోజుకు పది నుంచి 12 గంటలు పాఠశాలలో శ్రమించింది కాక ఇంటికి వెళ్లిన తర్వాత కూడా పాఠశాలకు సంబంధించిన ప్రిపరేషన్ వర్క్, లెస్సన్ ప్లాన్ వంటి పనులతో ఉపాధ్యాయులు విసిగి వేజారిపోతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా సీజన్‌కు ముందే క్యాంపెయినింగ్ పేరుతో ఓట్ల కోసం ఇంటింటికీ తిరిగే రాజకీయ నాయకుల్లా అడ్మిషన్ల కోసం ఇంటింటికీ తిప్పుతూ ఉపాధ్యాయ వృత్తినే కించపరచేలా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు విద్యా వ్యాపారన్ని నిస్సిగ్గుగా కొనసాగిస్తున్నాయి. మహిళా ఉపాధ్యాయునీల పరిస్థితి మరీ దారుణం. తాము తమ సొంత ఇంటి పనులు చేసుకోవడానికి కూడా సమయం లేక, తమ పిల్లల పర్యవేక్షణకు కూడా సమయం కేటాయించలేకపోతున్నామని అనేకమంది మహిళా ఉపాధ్యాయునీలు ఆవేదన చెందుతున్నారు. ఇంత వెట్టి చాకిరి చేయించుకుంటున్నా పనికి తగిన వేతనం ఇవ్వక, వేరే ఉపాధి అవకాశాలు దొరకక చేసేదేమీ లేక వెట్టి చాకిరి చేస్తూ ప్రైవేటు పాఠశాలల్లోనే తమ జీవితాలను నెట్టుకొస్తున్నారు.

విద్యాశాఖ పర్యవేక్షణ శూన్యం

పాఠశాలలు అధిక ఫీజుల వసూళ్లకు పాల్పడుతున్నా, విద్యార్థుల రక్షణ, అవసరాలకు సంబంధించిన సదుపాయాలను కల్పించకపోయినా.. పాఠశాల విద్యలో క్రీడాంశాన్ని పాటించకపోయినా, తరగతి గదిలో సామర్థ్యానికి మించి 40 నుంచి 50 మంది విద్యార్థులతో తరగతిగదిని గొర్రెల దొడ్డిలా మార్చేస్తున్నా, పాఠ్యపుస్తకాల వ్యాపారం జోరుగా కొనసాగిస్తున్నా, పనివేళలకు మించి ఉపాధ్యాయులుచే వెట్టి చాకిరి చేయించుకుంటున్నా, ప్రైవేటుపై విద్యార్థి సంఘాలు గగ్గోలు పెడుతున్నా.. ప్రైవేటు పాఠశాలల ఆగడాలు ఇంతింత కాదయా అంటూ విచిత్ర లీలలు ప్రదర్శిస్తున్నా విద్యాశాఖకు మాత్రం కళ్ళు కనబడట్లేదు, చెవులు వినపడట్లేదు. విద్యాశాఖ అధికారులు మండల వ్యాప్తంగా ఏ ఒక్క పాఠశాలను తనిఖీ చేసిన పాపాన పోలేదు. చర్యలు తీసుకున్న దాఖలాలు అంతకన్నా లేవు అనడంలో సందేహమే లేదు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు కళ్ళు తెరుచుకుని ప్రైవేటు పాఠశాలల ఆగడాలను కట్టడి చేస్తారో లేదో వేచి చూడాల్సిందే.

రాచిలుకల ఆకృతిలో మామిడిపండ్లు

విశాలాంధ్ర-వేంపల్లి: పంచవన్నెల రాచిలుకల ఆకారంలో మామిడి పండ్లు కనిపించడం సర్వత్రా ఆశ్చర్యానికి గురిచేసింది. కడప జిల్లా చక్రాయపేట మండలం ముద్దప్పగారిపల్లెలో ఒక విచిత్ర ఘటన చోటుచేసుకుంది. స్థానిక రైతు మూలంరెడ్డి సిద్ధారెడ్డి మామిడి తోటలో కాసిన రెండు మామిడి కాయలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. సాధారణంగా మామిడి కాయలు గుండ్రంగా లేదా ఒంపుసొంపుగా ఉంటాయి. కానీ ఈ 2 మామిడి కాయలు పంచదార చిలక ఆకారంలో ఉండడం గమనార్హం. చిలక ముక్కు, తోక, రూపం లాగా కనిపించే ఈ కాయలను కోసి ఇంటికి తేవడంతో స్థానికులు ఆసక్తిగా తిలకిస్తున్నారు. ఈ అరుదైన ఫలాలను చూసిన ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఈ వింత ఫలాలు చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కొందరు ఆ రైతు ఇంటికి వస్తున్నారు. మామిడి పండ్లు చిలుకల ఆకృతిలో కనిపించడం చర్చనీయాంశంగా మారింది.

రామగంగి రెడ్డికి తులసిరెడ్డి పరామర్శ

విశాలాంధ్ర-వేంపల్లి: వేంపల్లె వాణి స్కూల్ కరస్పాండెంట్ భూమిరెడ్డి రామగంగిరెడ్డిని మాజీ రాజ్యసభ సభ్యులు తులసిరెడ్డి ఆదివారం పరామర్శించారు. గత కొంత కాలంగా రామగంగిరెడ్డి అనారోగ్యానికి గురయ్యారు. ఈ నేపధ్యంలో వైద్య చికిత్స అనంతరం రామగంగిరెడ్డి ఆరోగ్యం కుదుటపడటంతో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న తులసిరెడ్డి ఆదివారం రామగంగిరెడ్డి ఇంటికి వెళ్లి ఆయన ఆరోగ్య క్షేమ సచారాన్ని తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని రామగంగిరెడ్డికి వివరించారు. ఆయన వెంట అమర్‌నాథరెడ్డి తదితరులు ఉన్నారు.

లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానం: ప్రిన్సిపాల్

విశాలాంధ్ర-రైల్వేకోడూరు: నియోజకవర్గం ఓబులవారిపల్లి మండలం చిన్నఓరంపాడు గ్రామపంచాయితీ పరిధిలో జాతీయ రహదారి పక్కన ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2025-26సంవత్సరానికి గాను ఖాలీగా ఉన్న భౌతికశాస్త్రం(ఫిజిక్స్) బోధనకు అతిథి అధ్యాపకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ హరిత పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న పిజి అర్హత కలిగిన అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో 1 జులై 2025న మంగళవారం ఉదయం 11గంటలకు జూనియర్ కళాశాలలో జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలలో సిబ్బంది కొరత

- ప్రభుత్వం తక్షణమే సిబ్బందిని నియమించాలి

విశాలాంధ్ర-బ్రహ్మంగారిమఠం: మండలం ప్రభుత్వ కార్యాలయాల్లో సిబ్బంది కొరత అయ్యేలా అవస్థలు పడుతున్నారని, మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో లేకపోవడంతో ఇంచార్జ్ ఎంపీడీవో గా కొనసాగిస్తున్నారని, పంచాయతీరాజ్ శాఖ, ఇంచార్జి అధికారి గా పని చేస్తూ, విస్తరణ అధికారి ఈవోపీఆర్డి , అధికారి కూడా జూనియర్ అసిస్టెంట్ అధికారి బదిలీ కావడంతో ఆఫీస్ టైపిస్ట్ అప్పటినుండి ఆఫీసులో సిబ్బంది కొరత ఉండ డం ప్రజల్లో అవస్థలు పడుతున్నారు. బ్రహ్మంగారిమఠం మండలం నుండి ఇద్దరు ప్రజా ప్రతినిధులు, జిల్లా పరిషత్ చైర్మన్, ఎమ్మెల్యే ఉన్న సొంత మండలాల్లో అధికారుల కొరత ఉంది. ప్రభుత్వం తక్షణమే దృష్టి పెట్టి కార్యాలయానికి అధికారులను నియమించాలని ప్రజలు ప్రజాప్రతినిధులు కోరుతున్నారు. అదేవిధంగా రెవెన్యూ కార్యాలయంలో తాహశీల్దార్ ఇంచార్జి పనిచేస్తున్నారని రెగ్యులర్ నియమించాలని, రెవెన్యూ ఇన్స్పెక్టర్, రెండు సంవత్సరాలు అధికారి లేకపోవడంతో వీఆర్వోలు కూడా ఇన్చార్జిగా కొనసాగుతున్నారని అదేవిధంగా బ్రహ్మంగారిమఠం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మరో వైద్యాధికారిని నియమించాలని, పలుగురోళ్లపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మరోవైద్యాధికాన్ని నియమించాలని, కొన్ని సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్లు ఇంజనీర్ అసిస్టెంట్లు కూడా ఇన్చార్జిలుగా బాధ్యతలు చేపడుతున్నారని ప్రభుత్వం వెంటనే స్పందించి ఇన్చార్జిలుగా ఉన్న అధికారులను తొలగించి రెగ్యులర్‌గా అధికారులను నియమించాలని మండల ప్రజలు, ప్రజా ప్రతినిధులు కోరుతున్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర-ముద్దనూరు: స్థానిక పట్టణంలోని బాలనాగిరెడ్డి వైద్యశాల నందు ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రొద్దుటూరు పట్టణంలోని వీర గాయత్రి హాస్పిటల్, గాయత్రి పర్టిలిటీ సెంటర్ ఆధ్వర్యంలో సుమారు 100 మంది గర్భిణీ స్త్రీలకు డాక్టర్ కందుల సుమిత్ర గైనకాలజిస్ట్ ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించి సూచనలు సలహాలు అందించారు. వైద్య శిబిరానికి హాజరైన గర్భిణీ స్త్రీలకు స్కానింగ్, కన్సల్టేషన్, సిమెంట్ అనాలసిస్ వంటి సేవలను ఉచితంగా అందించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నవ్య జ్యోతి రెడ్డి, మాజీ సర్పంచ్ బాలనాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు సభాభవన్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ నిర్వహణ

- డీఆర్వో విశ్వేశ్వర నాయుడు

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్: వైయస్సార్ కడప జిల్లా, జూన్ 29: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించిన మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని డీఆర్వో విశ్వేశ్వర నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని డిఆర్వో కోరారు.

సభాభవన్‌లో పిజిఆర్ఎస్ నిర్వహణ

ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను ఈ సోమవారం సభాభవన్ లో నిర్వహిస్తున్నట్లు డీఆర్వో విశ్వేశ్వర నాయుడు తెలిపారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చును. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామన్నారు.అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో కూడా సమర్పించుకోవచ్చునన్నారు.

డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం

డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 9.30 నుండి 10గంటల వరకు జరుగుతుందన్నారు.ప్రజలు 08562-244437 ల్యాండ్ లైన్ నెంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకోవచ్చునన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఆర్వో ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

మహాన్యూస్ కార్యాలయంపై దాడి అప్రజాస్వామికం: తులసిరెడ్డి

విశాలాంధ్ర-వేంపల్లి: హైదరాబాద్, ఫిల్మ్‌నగర్‌లో మహా టివి ఛానల్ ప్రధాన కార్యాలయంపై కొందరు బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు భౌతికంగా దాడి చేయడం, వాహనాలు, సామాగ్రి ధ్వంసం చేయడం, సిబ్బందిని గాయపరచడం అప్రజాస్వామికం, గర్హనీయమని రాజ్య సభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు.నిందితుల మీద తెలంగాణా ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

అధిక జనాభాతో అనేక ఇబ్బందులు

సగిలేరు గురుకుల పాటశాలను కొనసాగించాలి. కడప జిల్లా, బద్వేల్ నియోజక వర్గం, బి.కోడూరు మండలంలో 1983లో ఎస్సీ బాలుర గురుకుల పాఠశాలను ప్రారంభించడం జరిగింది. విద్యార్థుల సంఖ్య 600. ఈ గురుకుల పాఠశాలను మూసి వేసి మైదుకూరు నియోజక వర్గం, బి. మఠం మండలం తోట పల్లి మహా గురుకుల పాఠశాలలో కలపాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం దురదృష్టకరం. ఇది తిరోగమన చర్య.ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని, సగిలేరు గురుకుల పాఠశాలను యధావిధిగా కొనసాగించాలని తులసి రెడ్డి విజ్ఞప్తి చేశారు.

ఆరోగ్య వరప్రదాయని.. ఈత పండ్లు

మొదటి పేజీ తరువాయి

ఈత చెట్ల నుండి కల్లును తీస్తారు. వీటిపై తెగులు కూడా వారి జీవనం సాగిస్తారు. ఈతకల్లు శరీరం చల్లబడేందుకు ఉపయోగపడుతుంది. ఈత ఆకులు కూడా ఎంతో ఉపయోగాలను అందిస్తాయి. ఈతాకుల నుంచి చాపలు, మరిన్ని గృహూపకర వస్తువులను తయారు చేసేందుకు ఎంతో ఉపయోగపడతాయి. ప్రస్తుతం వాతావరణంలో వచ్చిన మార్పుల నేపథ్యంలో చాలావరకు ఈత సంపద అంతరించిపోయింది. ఈత పండ్లను ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకొని వ్యాపారం సాగిస్తున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. వీటి ధర కూడా అందరికీ అందుబాటులోనే ఉంటుంది. ఎంతో ఉపయోగపడే ఈత పండ్లు కాస్త వగరు తీపి కలిసి ఉంటాయి. వీటి సంపద సాగు ద్వారా కూడా చేపట్టవచ్చని యువత యువసాయ అధికారులు చెబుతున్నారు. ఆ దిశగా అంతరించిన ఈత సంపదను మళ్ళీ పునర్దర్శనమిచ్చేందుకు కృషి చేద్దాం.

రామలక్ష్మమ్మకు ఘన నివాళి

విశాలాంధ్ర-వీరబల్లి: వీరబల్లి మండల కేంద్రంలో క్రీస్తు శేషులు మాజీ మండల ఉపాధ్యక్షురాలు, మాజీ జెడ్పిటిసి సభ్యులు, మాజీ సర్పంచ్, మాజీ కోఆప్షన్ నెంబర్ ఆయన గాలివీటి రామలక్ష్మమ్మ నాలుగవ వర్ధంతి వేడుకలను ఆదివారం తన నివాసంలో ఘనంగా నిర్వహించారు. ఆమె కుమారులైన వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు గాలివీటి విజయభాస్కర్ రెడ్డి, ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి, మనవడు రాజంపేట నియోజకవర్గం వైఎస్ఆర్సిపి యువ నాయకులు మదన్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ వేడుకలను నిర్వహించడం జరిగింది. మండలంలోని వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొని ఆమె చిత్రపటం దగ్గర నివాళులర్పించారు. అంతేకాక కుమార్తె అయిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సతీమణి స్వర్ణమ్మ పాల్గొని తల్లికి నివాళులర్పించారు. సంప్రదాయపద్ధంగా ఆమెకు వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. హాజరైన అభిమానులకు ప్రజాపతినిధులకు నాయకులకు భోజనాలు కూడా ఏర్పాటు చేయడం జరిగింది.

బిసిల ఐక్యతతోనే రాజ్యాధికారం సాధ్యం

జనాభా దామాషా ప్రకారం రాజ్యాంగ పదవులలో బీసీలకు ప్రాతినిధ్యం బీసీల హక్కు

విశాలాంధ్ర-మదనపల్లె: బిసిల రాజ్యాధికారం బిసిల ఐక్యత తోనే సాధ్యమని బీసీ హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బోడే రాజశేఖర్ తెలిపారు. ఆదివారం స్థానిక శ్రీకృష్ణ కళ్యాణ మండపం నందు జరిగిన సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో మదనపల్లి నియోజకవర్గ సీనియర్ కాంగ్రెస్ నాయకులు, బీసీ నాయకులు అయినటువంటి షేక్ రెడ్డి సాహెబ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెడ్డి సాహెబ్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో దాదాపు 240 బిసి కులాలకు చెందిన వారు అందరూ కులాన్ని వదలి బిసి కులంగా ఏకతాటిపైకి వచ్చి తమ గళాన్ని వినిపిస్తే రాజ్యాధికారం దాసోహం అవుతుందన్నారు. బిసిల ఓట్లు కోసం నా బిసి అనే రాజకీయ పార్టీలు బిసిలు ఐక్యతగా ఉంటే బిసిల చూట్టూ తిరిగే పరిస్థితి రావాలని, ఎస్సీ, ఎస్టీ తరహాలోనే బిసిలకు ప్రత్యేక చట్టం తీసుకుని రావాలన్నారు. ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్ నియోజకవర్గాల లాగానే బిసిలకు కూడా బీసీ రిజర్వేషన్ నియోజకవర్గాలను కేటాయించాలని అప్పుడే బీసీలకు రాజ్యాధికారం హక్కుగా పొందడానికి వీలవుతుందని అన్నారు. కావున పాలకులు ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్లు లాగానే బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని, బీసీల గొంతుకగా ఈరోజు మదనపల్లిలో బీసీ ఐక్యత సమావేశంలో గళంబిప్పడం జరిగినది. అత్యధిక శాతం జనాభా ఉన్న బీసీ వర్గాలకు విద్యలో కానీ ఉద్యోగాలలో కానీ రాజకీయాలలో కానీ ఉపాధి అవకాశాలలో కానీ జనాభా దామాషా ప్రకారం ప్రాధాన్యతను ప్రస్తుత ప్రభుత్వం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులతో పాటు కాంగ్రెస్ నాయకులు ఈశ్వరమ్మ, నాగరాజు, పాలేటి ,మహబూబ్, మహమ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

సమాజాన్ని కదిలించే శక్తిగా మానవతా సంస్థ

విశాలాంధ్ర-రాయచోటి: సేవా కార్యక్రమాల ద్వారానే అహంకారం నశిస్తుందని, ఇంటికొకరు మానవత అనే నినాదంతో, సమాజాన్ని కదిలించే శక్తిగా మానవతా సంస్థ ముందుకెళుతుందని మానవత వ్యవస్థాపకులు యన్.రామచంద్ర రెడ్డి అన్నారు. అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణం చిత్తూరు రోడ్డు నందు ఎస్ ఆర్ కళ్యాణ మండపంలో పండుగ వాతావరణంలో ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షులు బ్రహ్మానంద రెడ్డి, రాయచోటి అధ్యక్షులుగా అంకం జయచంద్ర రెడ్డి ప్రమణా స్వీకారోత్సవం కార్యక్రమం రాయచోటి మానవత చైర్మన్ అరమాటి శివగంగి రెడ్డి,పూర్వపు అధ్యక్షులు గాండ్లపెంట ఖాదర్ బాష,కన్వీనర్ చింతం రెడ్డి వెంకట్రామి రెడ్డి అద్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మానవత వ్యవస్థాపకులు యన్ రామచంద్ర రెడ్డి,కేంద్ర కమిటి సభ్యులు నిమ్మనపల్లి సహదేవ రెడ్డి.అవటాల రామంజులు రెడ్డి, జిల్లా విద్యాకమిటి సభ్యులు రాటాల గోపీ, రాయచోటి శాఖ గౌరవ అధ్యక్షుడు బెల్లం లోకనాథ రెడ్డి లు హాజరయ్యారు. 2025-26 ఉమ్మడి కడప జిల్లా, రాయచోటి మండల కమిటి నూతన కార్యవర్గ జిల్లా సెక్రెటరి రామానాయుడు, కోశాధికారి హరికుమార్, ఉపాధ్యక్షులు అల్లం రెడ్డప్ప రెడ్డి, సంయుక్త కార్యదర్శి కావలి కృష్ణతేజ, ఈసీ చైతన్య చవ్వా కృష్ణా రెడ్డి, ఈసీ విద్య డి.రామిరెడ్డి, ఈసీ ఆరోగ్య కల్లూరు గంగాధర రెడ్డి, ఈసీ అత్యవసర పాలకొండ రాయుడు, రాయచోటి కమిటి సెక్రెటరి బుక్కే నాగేశ్వర నాయక్, కోశాధికారి టేకురి నాగార్జున, ఉపాధ్యక్షులు పురుం మురళి మోహన్ సంయుక్త కార్యదర్శి సాధు బసిరెడ్డి,ఈసీ చైతన్య కేతంరెడ్డి హరినాథ రెడ్డి, ఈసీ విద్య మూడే రంజిత్ నాయక్, ఈసీ ఆరోగ్య దుర్గం సబ్బిర్, ఈసీ అత్యవసర మేకల శివారెడ్డి సభ్యులచే ప్రమణాస్వీకారాం ను గావించారు. నూతన కార్యవర్గం సభ్యులు అతిదిలును ఘనంగా సత్కరించారు. ఈ సందర్బంగా అధ్యక్షులు మాట్లాడుతూ తమపై నమ్మకం తో అధ్యక్షులుగా అవకాసం ఇచ్చిన మానవత సంస్థ వ్యస్తపకులకు రాష్ట్ర ,జిల్లా కమిటి సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో మానవత కుటుంబ సభ్యులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్తకి గుర్తింపు

రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడు శ్రీరాం చిన్నబాబు

విశాలాంధ్ర- రామసముద్రం: తెలుగుదేశం పార్టీ సమస్తాగత ఎన్నికలలో 10 సంవత్సరాల నుండి పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్తకి సముచిత స్థానం కల్పిస్తామని రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు తెలిపారు ఆదివారం ఆయన రామసముద్రం మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ సమస్తాగత ఎన్నికల కమిటీల్లో పార్టీ కోసం కష్టపడిన ప్రతి టీడీపీ కార్యకర్త కి మాత్రమే న్యాయం జరుగుతుంది తప్పా వేరే వారికి ఎవరికి చోటు ఉండదన్నారు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభివృద్ధి సంక్షేమం రెండు కల్లుల రాష్ట్రాన్ని నడిపిస్తున్నారని కొనియాడారు కూటమి ప్రభుత్వంలో ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని చెప్పారు కార్యక్రమంలో మండల తెలుగు యువత అధ్యక్షుడు ప్రశాంత్ రెడ్డి, నియోజకవర్గ ఐటీడీపీ ఉపాధ్యక్షులు శ్రీనాథ్ రెడ్డి, హేమంత్ రెడ్డి, అమర్నాథ్, ఆన్సర్ భాషా, సోమనాథ రెడ్డి, కృష్ణప్ప, గంగప్ప, మంజునాథ, కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

బాస్ ఆధ్వర్యంలో 20వ ఉచిత గుండె వైద్య శిబిరం

విశాలాంధ్ర-మదనపల్లె: నారాయణ హృదయాలయ వైద్యులతో కలిసి, భారతీయ అంబేడ్కర్ సేన (బాస్) నిర్వహించిన 20వ ఉచిత గుండె వైద్య శిభిరానికి విశేష స్పందన లభించింది. మదనపల్లి టౌన్ అమ్మచెర్వుమిట్ట మునిసిపల్ హైస్కూల్ నందు ఆదివారం ఉదయం 10 గంటల నుండి, సాయంత్రం 6 గంటల వరకూ ఈవైద్య శిభిరం జరిగింది. బాస్ వ్యవస్థాపకుడు పీటీయం శివప్రసాద్ పర్యవేక్షణలో జరిగిన ఈ వైద్య శిభిరంలో నారాయణ హృదయాలయ కోలార్ బ్రాంచ్ కు చెందిన ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ ఎస్. కిరణ్ కుమార్ మరియు గుండె పరీక్షల టెక్నిషన్లు పాల్గొన్నారు. ఈసందర్భంగా 176 మందికి బీపి, షుగర్, ఈసీజీ, ఎకో తదితర గుండె పరీక్షలు నిర్వహించారు. పరీక్షల్లో 11 మందికి గుండె జబ్బులు ఉన్నట్లు నిర్ధారణ కావడంతో వారిని శస్త్ర చికిత్సలకు రెఫర్ చేశారు. వీరికి కోలార్ లోని నారాయణ హార్ట్ సెంటర్ నందు డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకం క్రింద ఉచితంగా చికిత్సలు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో వారాహి అమ్మవారి శ్రీమంతం కార్యక్రమం

విశాలాంధ్ర - పీలేరు : వారాహి అమ్మవారి గుప్త నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా పీలేరు బ్రాహ్మణ వీధిలోని శివాలయ ప్రధాన అర్చకులు విరూపాక్షం కుమారస్వామి ఇంటిలో ఆదివారం అమ్మవారి శ్రీమంతాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీమంతం సందర్భంగా అమ్మవారి విగ్రహాన్ని వివిధ సుగంధ పుష్పాలు సుగంధ ద్రవ్యాలతో విశేషంగా అలంకరించి వివిధ రకాల పిండి వంటలను అమ్మవారికి సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి మహిళలకు తీర్థప్రసాదాలు అందజేశారు.శ్రీమంతం కార్యక్రమం సందర్భంగా అమ్మవారికి ముత్తయిదువుల ప్రార్థన ప్రత్యేకంగా నిర్వహించారు.

పాతికేళ్ల తర్వాత పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

విశాలాంధ్ర - వీరబల్లి : వీరబల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999-2000 సంవత్సరం పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల అత్మీయ సమ్మేళనం ఆదివారం ఉదయం అట్టహాసంగా జరిగింది. ఇక్కడ విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు వివిధ స్థాయిలో ఉన్నవారు అందరూ హాజరయ్యారు. ఆరు నుంచి పదో తరగతి వరకు చదివిన విద్యార్థులు 25 ఏళ్ల తర్వాత ఒక్కచోట కలుసుకుని సందడి చేశారు. ఒకరికొకరు యోగక్షేమాలు తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. చదివిన బడి, పరిసరాలను చూసి భావోద్వేగానికి గురయ్యారు. నాడు గురువులు నేర్పిన క్రమశిక్షణ, చదువుతో ఈరోజు వివిధ స్థాయిల్లో ఉన్నామని తెలిపారు. పూర్వ విద్యార్థులు తమకు విద్యను బోధించిన నాటి ఉపాధ్యాయులు రామకృష్ణమూర్తి, మడితాటి నరసింహారెడ్డి, శ్రీనివాసులు, శోభన్ బాబు మల్లేశం, హరినాథలను దుశ్యాలవులతోనూ పూలమాలలతోనూ జ్ఞాపికలను ఇచ్చి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం నిర్వాహకులు, పాఠశాల పూర్వ విద్యార్థి ఎన్ గిరిబాబు, మస్తాన్ లు మాట్లాడుతూ క్రమం తప్పకుండా ప్రతి సంవత్సరం పూర్వ విద్యార్థులు కలుసుకొని తమకు విద్యను బోధించిన ఉపాధ్యాయులను సన్మానించ´డంతోపాటు పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. పాఠశాల అభివృద్ధి కోసం 10,000 రూపాయలను పాఠశాల ఉపాధ్యాయులు రామ్మోహన్ కు అందజేశారు. పాఠశాల అభివృద్ధికి మరింత సహాయ సహకారాలను అందిస్తామన్నారు. ఈ క్రమంలో ఉపాధ్యాయులు నాటి రోజులను గుర్తుకు చేసుకొని ఓల్డ్ ఇస్ గోల్డ్ అనే మాట మరోసారి నిరూపితమైందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పూర్వ ఉపాధ్యాయులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పూర్వ విద్యార్థులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడులను ఆపాలి

మహాటీవి కార్యాలయంపై దాడి చేసిన వారిని శిక్షించాలి

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను ప్రభుత్వాలు ఆపాలని ప్రొద్దుటూరు జర్నలిస్టులు డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని మహాటీవీ కార్యాలయంపై బీఆర్ఎస్ నాయకులు దాడి చేసిన ఘటనను నిరసిస్తూ ప్రొద్దుటూరు జర్నలిస్టులు స్థానిక ప్రెస్‌క్లబ్ కార్యాలయం నుండి నినాదాలు చేస్తూ పాత బస్టాండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సంధర్భంగా సీనియర్ జర్నలిస్టులు మాట్లాడుతూ తరచూ జర్నలిస్టులపై దాడులు చేయడం సరికాదన్నారు. రాష్ట్రంలో ప్రజా ప్రతినిధుల అవినీతి అక్రమాలను బయటపెడుతున్న పత్రికలు, టీవీ ఛానళ్లపై రాజకీయ రౌడీమూకలు దాడి చేయడం సరికాదన్నారు. దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ గ్రామ నూతన కమిటీ నియామకం

విశాలాంధ్ర - బ్రహ్మంగారిమఠం : పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మండలంలో అన్ని గ్రామాలలో గ్రామ కమిటీలను ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశాల మేరకే, అందులో భాగంగానే,బ్రహ్మంగారిమఠం మండల ఎమ్మార్పీఎస్ ఇంచార్జ్ జ్ఞానేశ్వర్ రావు మాదిగ ఆధ్వర్యంలో బ్రహ్మంగారిమఠం మండలం లోని కందిమల్లాయపల్లె, తోట్లపల్లి వివిధ గ్రామాలలో గ్రామంలో ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ వేయడం జరిగింది గ్రామ అధ్యక్షులుగా సోమిరెడ్డి పల్లె కేశవ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ రవి ఉపాధ్యక్షులు ఎస్ సురేష్ ఎన్ హరి కార్యదర్శులు యం గురయ్యఎస్ రాజా ఎస్ భాస్కర్ ప్రధాన కార్యదర్శి ఎస్ ఈశ్వర్ కోశాధికారి జి జయన్న ప్రచార కార్యదర్శి ఎన్ జె ఎస్ రంజన్ కార్యవర్గ సభ్యులు ఎస్ బాలరాజ్ పి మల్లేష్ ఎన్ బాల ఓబయ్య ఎన్ రమేష్ ఎం ఓబులేసు జె సత్యరాజు ఎస్ ప్రసాద్ ఎం సతీష్ లను ఎన్నుకోవడం జరిగింది ఈ కార్యక్రమానికి ఎం ఎస్ పి సీనియర్ నాయకులు సోమిరెడ్డిపల్లి నారాయణ ఎమ్మార్పీఎస్ మండల నాయకులు అంతోని ఎస్ చిన్నప్ప పాల్గొన్నారు

మానవత్వం చాటుకున్న ఎంపీ అవినాష్‌రెడ్డి

విశాలాంధ్ర-పులివెందుల: కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి మానవత్వం చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే.. ఆదివారం సాయంత్రం పట్టణంలోని స్థానిక జేఎన్టీయూ కాలేజీ సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. తొండూరు మండలం కృష్ణంగారి పల్లె నుంచి పాల ఆటో పులివెందులకు వస్తుండగా జేఎన్టీయూ సమీపంలోకి రాగానే అక్కడ చెత్త కాగితాలు ఏరుకునే గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు దాటుతుండగా ఆ వ్యక్తినీ ఆటో ఢీ కొట్టి ఆటో పల్టీ పడింది.. దీనితో కాగితాలు ఏరుకునే గుర్తు తెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా ఆటోలో ప్రయాణిస్తున్న కృష్ణం గారి పల్లెకు చెందిన షబానా, శంషాద్ అని మహిళలకు స్వల్ప గాయాలయ్యాయి. అదే ఆటోలో ప్రయాణిస్తున్న కృష్ణంగారిపల్లెకు చెందిన హనుమంత్ రెడ్డికి నడుము భాగంలో గాయం కావడంతో అతను లేవలేని స్థితిలో రోడ్డుపైనే పడిపోయాడు. ఆ సమయంలో అటువైపుగా పులివెందులకు వస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి తన కాన్వాయ్ నీ ఆపి క్రిందకు దిగి గాయాల పాలైన హనుమంత్ రెడ్డిని పరామర్శించి అప్పటికి అక్కడికి 108 వాహనం గాని చేరుకోకపోవడంతో తన సెక్యూరిటీ వాహనం ద్వారా స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించాలని అనుచరులకు ఆదేశించారు. దీంతో ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి సెక్యూరిటీ వాహనంలో హుటాహుటిన గాయాలైన హనుమంత్ రెడ్డిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మీడియా కార్యాలయంపై దాడి చేసిన దుండగులను శిక్షించాలి

విశాలాంధ్ర-మైదుకూరు: జర్నలిస్ట్ కార్యాలయంపై దాడీ హెయమైన చర్యఅని మైదుకూరు మీడియా ప్రతినిధులు అన్నారు. హైదరాబాదులోని మహా న్యూస్ ప్రధాన కార్యాలయంపై దాడి చేసిన టిఆర్ఎస్ నేతలు దుండగులను కఠినంగా శిక్షించాలని మైదుకూరు నియోజకవర్గం ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు అర్బన్ ఎస్ఐ చిరంజీవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్టీవీ రిపోర్టర్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు కరెడ్ల క్రిష్ణ మీడియా సీనియర్ రిపోర్టర్ మోహన్ ప్రతినిధులు మాట్లాడుతూ హైదరాబాదులోని మహా న్యూస్ కార్యాలయంపై దుండగులు కర్రలు రాళ్లతో దాడి చేయడం బిల్డింగ్ అద్దాలు కార్ల అద్దాలు పగలగొట్టడం ఏమైనా చర్య అన్నారు.మహా టీవీ కార్యాలయంపై చేసిన దాడి ప్రజాస్వామ్యంపై చేసిన దాడిగానే పరిగణిస్తామన్నారు. భవిష్యత్తులో మీడియాపై దాడులు జరగకుండా దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

సమాజ సేవ చేయకపోతే జీవితం వ్యర్థం

- జెడ్పీటీసీ మాజీ సభ్యులు పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

విశాలాంధ్ర-పులివెందుల: సామాజిక సేవ కు ఉపయోగ పడని జీవితం వ్యర్థమని జెడ్పి టిసి మాజీ సభ్యులు విద్యాప్రదాత, పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. పులివెందులలో ఆదివారం జరిగిన మానవత సంస్థ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారము అలాగే పదో తరగతి పరీక్షలలో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు నగదు బహుమతుల పురస్కార కార్యక్రమాలకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు .రిటైర్డ్ ఎంఈఓ సదాశివారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సమాజ సేవ చేయడానికి వారిని సన్నద్ధులు చేయాలని, విద్యార్థులలో నైతిక విలువలను పెంపొందింపజేసి వారిని మంచి పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు మానవత సంస్థ కృషి చేయాలని చెప్పారు. ఎస్సీ ఎస్ఆర్ అధినేత సారెడ్డి చంద్రశేఖర రెడ్డి మాట్లాడుతూ మానవత సంస్థ అభివృద్ధికి తన సహకారము ఎల్లవేళలా ఉంటుందన్నారు. సమావేశంలో ఈఎన్టీ డాక్టరు జస్మిత, అధ్యక్ష కార్యదర్శులు జయరాజు, గంగిరెడ్డి, జిల్లా కౌన్సిల్ రీజియన్ సభ్యులు చెవ్వ కృష్ణారెడ్డి, జి.చంద్రశేఖర్ రెడ్డి, కోశాధికారి బండి హరిశ్చంద్రారెడ్డి, శివరామిరెడ్డి, శ్రీనివాస రెడ్డి, శేషయ్య, పద్మావతి తదితరులు ప్రసంగించారు. స్రారెడ్డి చంద్రశేఖర రెడ్డి సభ్యులకు అల్పాహారము ఏర్పాటు చేశారు.

నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

మానవత స్వచ్ఛంద సంస్థ పులివెందుల నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం జరిగింది. మానవత సంస్థ నూతన అధ్యక్ష కార్యదర్శులుగా జి.చంద్రశేఖర్ రెడ్డి, ముక్కోటి వెంకట శేషయ్య, కోశాధికారిగా బండి హరిశ్చంద్రారెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. ఉపాధ్యక్ష ఇతర కార్యవర్గ సభ్యులుగా సోమా పద్మావతి, వై శ్రీనివాసరెడ్డి, జి నరేష్ ,బండి శివరామిరెడ్డి, పి.రాజేశ్వరరెడ్డిలతో సంస్థ చైర్మన్ డివి కొండారెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన జెడ్పిటిసి మాజీ సభ్యుడు పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి, సారెడ్డి చంద్రశేఖర రెడ్డి, ఈఎన్‌టి డాక్టర్ జస్మితలు కొత్త కార్యవర్గాన్ని అభినందించారు. రిటైర్డ్ ఎంఈఓ సదాశివారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు మానవతా సభ్యులు కూడా పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు బహుమతులు

పులివెందుల మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రిటైర్డ్ ఎంఈఓ దేవి రెడ్డి సదాశివారెడ్డి అధ్యక్షతన ఆదివారం జరిగిన కార్యక్రమములో పదవ తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు బహుమతులు ప్రధానం చేశారు. .మానవత జిల్లా కౌన్సిల్ సభ్యులు చెవ్వా కృష్ణారెడ్డి తమ తండ్రి రామిరెడ్డి జ్ఞాపకార్థం 12 వేల రూపాయలను అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జడ్పీటీసీ మాజీ సభ్యులు పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి ,ఎస్సీ ఎస్సార్ అధినేత సారెడ్డి చంద్రశేఖరరెడ్డి, ఇఎన్టి స్పెషలిస్ట్ డాక్టరు జస్మిత చేతుల మీదుగా నగదును, మెమెంటోలను అందజేశారు. పులివెందుల నియోజకవర్గంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతిలో అత్యధికంగా 595 మార్కులు సాధించిన రావుల కొలను విద్యార్థిని జోషికకు ఐదువేల రూపాయలు, రెండవ స్థానములో నిలిచిన రామిరెడ్డిపల్లె విద్యార్థి గంగా మహేశ్వరరెడ్డికి 3వేల రూపాయలు, వేముల జడ్పీ పాఠశాలకు చెందిన కార్తీక్‌నకు మూడవ బహుమతి కింద రెండు వేల రూపాయలు, హిమకుంట్ల పాఠశాల విద్యార్థి హాసికకు నాలుగవ బహుమతి కింద రెండు వేల రూపాయలను, మెమెంటోలను ముఖ్య అతిథులు అందజేశారు.

ప్రజా సంక్షేమంపై ప్రత్యేక దృష్టి: ఈవో మాధవరెడ్డి

విశాలాంధ్ర-వేంపల్లి: ప్రజా సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వేంపల్లె ఈవో మాధవరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్యంపై అధిక ప్రాధాన్యత నిస్తామన్నారు. అలాటే అండర్ గ్రౌండ్ సిస్టమ్ పై కూడా ప్రత్యేక శ్రద్ధ వహిస్తామన్నారు. వర్షాలు వస్తున్న నేపథ్యంలో వర్షపు నీరు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటామ న్నారు. అదే విధంగా దోమలు వ్యాప్తి చెంద కుండా పటిష్టమైన చర్యలు చేపడతామన్నారు. విద్య, వైద్యం, విద్యుత్, ఉపాధిహామీ తదితర అంశాలపై ప్రాధాన్యత ఉంటుందన్నారు. వేంపల్లి పంచాయతీకి సంబంధించిన అన్ని రంగాల అభివృద్ధికి తమ వంతు తోడ్పాటు అంది స్తామన్నారు. ప్రజలు కూడా సహకరించాలని, ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసు కొస్తే పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తానని తెలిపారు.

టిడిపి కేంద్ర కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో పాల్గొన్న రాజంపేట పార్లమెంటు ఇంచార్జ్ చమర్తి

విశాలాంధ్ర-రాజంపేట: తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయం మంగళగిరి టిడిపి కేంద్ర కార్యాలయంలో సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టిన సమావేశానికి రాజంపేట పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు చమర్తి జగన్మోహన్ రాజు హాజరయ్యారు. జూలై రెండవ తేదీన నుండి ప్రతి ఇంటికి ప్రజలకు దగ్గరయ్యే విధంగా కూటమి ప్రభుత్వంలో ఏడాదిలో చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల గురించి ప్రభుత్వం అమలు చేస్తున్న మెగా డీఎస్సీ, పింఛన్లు, ఇండ్లు, గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఆగస్టు 15వ తేదీన మహిళలకు ఆర్టీసీ బస్సులో ఫ్రీగా ప్రయాణించడం ఇంకా మరెన్నో పథకాలను వివరిస్తూ ప్రజల్లోకి వెళ్లాలని సూచనల మేరకు మన రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు, టిడిపి ముఖ్య నేతలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రులకు ఎంపీలకు, ఎమ్మెల్యేలకు, ఇన్చార్జిలకు, దిశా నిర్దేశం చేయడం జరిగిందన్నారు.

కన్నుల పండువలా ఏరువాకమ్మ గ్రామోత్సవం

విశాలాంధ్ర-యర్రగుంట్ల: నగర పంచాయతీ పరిధిలోని వలసపల్లె రస్తాలో కొలువుదీరిన శ్రీ ఏరువాక గంగమ్మ తల్లి ఆలయ 28వ వార్షికోత్సవ వేడుక ఆదివారం ఘనంగా జరిగింది. ఉత్సవాన్ని పురస్కరించుకొని ఉదయం అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఇందుకోసం పూలను ప్రత్యేకంగా బెంగుళూరు నుంచి తెప్పించారు. అనంతరం మధ్యాహ్నం భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం జరిగింది. తదనంతరం డప్పు వాయిద్యాలు, మేళతాళాల మధ్య ఆలయం వద్ద నుండి నాలుగు రోడ్ల కూడలి వరకు అమ్మవారి గ్రామోత్సవం కన్నుల పండువలా సాగింది. బాణాసంచా పేలుళ్ళు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. దారి పొడవునా భక్తులు అమ్మవారిని దర్శించుకొని కొబ్బరికాయలు సమర్పించారు. భక్తులకు అమ్మవారు అభయమిస్తూ కనిపించారు. ఆలయ సేవా సమితి సభ్యులు ఉత్సవాల నేపథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

సగిలేరు గురుకుల పాఠశాల తరలించడం సబబుకాదు: కాంగ్రెస్

విశాలాంధ్ర-పోరుమామిళ్ల రూరల్: దాదాపు 30సంవత్సరాల నుంచి ఎటువంటి సమస్యలు లేకుండా బద్వేల్ నియోజక వర్గం పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన, బి.కోడూరు మండల విద్యార్థులకు అతి దగ్గరగా అన్ని వసతులతో చక్కగా రూపొందించిన సగిలేరు గురుకుల పాఠశాలను తరలించడం మంచిది కాదని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పీసీసీ సభ్యులు పోరుమామిళ్ల మండల అధ్యక్షుడు అన్వర్ పేర్కొన్నారు. ఈ పాఠశాల ఏర్పాటు చేసినప్పటి నుంచి ఇప్పటివరకు కొన్ని వేలమంది విద్యార్థులకు విద్యా బోధన అందించిందని ఆయన గుర్తు చేశారు. ఇప్పుడు మహా గురుకులం పేరుతో తోట్లపల్లిలో ఉన్నటువంటి గురుకుల పాఠశాలలో విలీనం చేయడం సబబు కాదని, తోట్లపల్లి గురుకుల పాఠశాలలో సగిలేరు గురుకుల విద్యార్థులను కలిపిన తోట్లపల్లి గురుకుల పాఠశాలలో భవనాలు, సదుపాయాలు ఆ మేరకు లేవని ఆయన గుర్తు చేశారు. సగిలేరులో ఉన్నటువంటి భవనాలను మరమ్మత్తులు చేసి ఇక్కడే అన్ని సదుపాయాలను సమకూర్చి బద్వేల్ నియోజకవర్గానికి ఉన్న ఏకైక గురుకుల పాఠశాల అయిన, సగిలేరు పాఠశాలను తరలించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు. బద్వేల్ నియోజకవర్గం లో ఉన్న నాలుగు మండలాల విద్యార్థు లకు అనుకూలంగా ఉండి అన్ని వసతు లతో ఉన్న, ఈ పాఠశాలను తరలించ కుండా ప్రజా ప్రతినిధులు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఆయన కోరారు.

కుక్కల దాడులతో భయభ్రాంతులవుతున్న బద్వేల్ ప్రజానీకం

- కుక్కలను నియంత్రించడంలో విఫలమైన మున్సిపల్ అధికారులు

విశాలాంధ్ర-బద్వేలు: బద్వేల్ పట్టణం ఆవాజ్ కమిటీ కార్యాలయం నందు ఆవాజ్ కమిటీ జిల్లా అధ్యక్షులు పి. చాంద్ భాష, బద్వేల్ పట్టణ ఆవాజ్ కమిటీ అధ్యక్షులు ఎస్ .అబ్దుల్ సత్తార్ లు మాట్లాడుతూ బద్వేల్ పట్టణం నందు ప్రతిరోజు కుక్క లు ప్రజల పైన దాడులు చేసి గాయపరచడం అధికమయ్యాయి కుక్కలను నియంత్రించడంలో మున్సిపల్ అధికారులు విఫలమయ్యారని వారు అన్నారు నిన్నటి దినం అబ్బరాతివీధిలో ఓ చిన్నారి పై పిచ్చి కుక్క దాడి చేసి ముఖంపై తీవ్ర గాయాలు చేయడం జరిగింది బద్వేల్ పట్టణంలో చిన్నారులు వీధిలో తిరగాలన్న స్కూళ్లకు వెళ్లాలన్నా కుక్కలు కరిచి గాయపరుస్తాయని భయాందోళనకు గురి అవుతున్నారు బద్వేల్ పట్టణంలో ప్రతిరోజు కుక్కలు ప్రజలకు కరిచి గాయపరుస్తున్నాయి గాయపడిన ప్రజలు ప్రతిరోజు ఆసుపత్రుల చుట్టూ తిరుగుతూ వైద్యం చేయించుకుంటున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు కఠిన నిర్ణయంతో కుక్కలా బెడద లేకుండా చేయాలని వారు కోరారు అలా చేయని పక్షంలో ప్రజలందరినీ ఏకం చేసి మున్సిపల్ కార్యాలయం నందు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు అన్నారు. ఈ సమావేశంలో ఆవాజ్ నాయకులు బాష, నాగూర్ పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాలలో శ్రీసాయిడిగ్రీ కళాశాల ప్రభంజనం

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : యోగి వేమన యూనివర్సిటీ 28 న విడుదల చేసిన డిగ్రీ 2 వ మరియు 4 వ సెమిస్టర్ ఫలితాలలో శ్రీసాయిడిగ్రీ కళాశాల విద్యార్థిని విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు.జిల్లాలో అత్యధిక మార్కులు సాధించి టౌన్ ఫస్ట్ విజేతలుగా, యూనివర్సిటీ ర్యాంకులు సాధించారు.4 వ సెమిస్టర్ బీఎస్సీ బోటనీ హానర్స్ నందు ఎస్ సల్మా 9.85, బీఎస్సీ కంప్యూటర్స్ లో ఎన్ రాజేశ్వరి 9.70, బికాం కంప్యూటర్స్ లో సి వైష్ణవి 9.50, 2 వ సెమిస్టర్ లో బికాం కంప్యూటర్స్ నందు కె మస్తఫ 9.75, ఎస్‌ఏ సాజియా,పి జస్వంత్ 9.50, బిఎస్సీ కంప్యూటర్స్ లో బి వర్షిణి,కె అక్షయ,ఎస్ అయేషా లు 9.75, బిఎస్సీ బోటనీ లో ఎస్ జాస్మిన్ 9.50 సాధించారు.9.0 జిపిఎ పైన 58 మంది అత్యధిక మార్కులు సాధించారు.అత్యధిక మార్కులు సాధించడానికి కృషి చేసిన గైడ్ చేసిన మరియు అధ్యాపకులకు కళాశాల ప్రిన్సిపాల్ ముత్యాల పెంచలయ్య, డైరెక్టర్స్ పి శ్రీనివాసులు, ఎస్ఎన్ శ్రీనివాసులు, కంచిరాజు చంగల్ రాజు,మరియు యు అనిత గారు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పెంచలయ్య మాట్లాడుతూ శ్రీసాయిడిగ్రీ కళాశాల ఆవిర్భావం నుంచి అద్భుత ఫలితాలు సాధించడం గర్వకారణం అన్నారు.అత్యుత్తమ ఫలితాలు, క్రమశిక్షణ శ్రీసాయిడిగ్రీ కళాశాలకే సాధ్యం అన్నారు.

వృద్ధులకు దివ్యాంగులకు ఇంటి వద్దనే రేషన్ బియ్యం పంపిణీ

విశాలాంధ్ర-రామాపురం : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలోని 35 చౌక దుకాణాల పరిధిలోని వృద్ధులకు దివ్యాంగులకు ఇంటి వద్దకే నిత్యవసరులను రేషన్ డీలర్లు ప్రభుత్వ ఆదేశాల మేరకు జూలై నెలకు సంబంధించి ముందుగానే పంపిణీ చేశారు . గత ప్రభుత్వంలో ఎండి యు వాహనాల తో ఇంటింటికి రేషన్ సరుకులు సరఫరా చేయాలని ఆదేశాలు ఉన్న ఎండియు వాహనదారులు గ్రామాలలో ఒకచోట వాహనాన్ని నిలబెట్టి అక్కడి నుండే సరఫరా చేసేవారు. దీంతో వృద్ధులు దివ్యాంగులు ఆ వీధిలోకి వెళ్లి బియ్యం తెచ్చుకోవాలంటే తీవ్ర అవస్థలు పడేవారు. కూటమి ప్రభుత్వం ముందుగానే తమ ఇంటికి రేషన్ డీలర్లు బియ్యం తెచ్చి ఇస్తుండడంతో వృద్ధులు దివ్యాంగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు ఈ పద్ధతి ఇలాగే కొనసాగితే మంచిదంటున్నారు.

దుండగులపై కాంగ్రెస్ ప్రభుత్వం కఠిన చర్యలు

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాదులో ఇటీవల మహా టీవీ న్యూస్ ఛానల్ ప్రధాన కార్యాలయం పై భారత్ రాష్ట్ర సమితి పార్టీకి చెందిన గూండాలు దాడి చేయడం అమానుషమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ విమర్శించారు. కడపలో ఆదివారం జర్నలిస్టు సంఘాలు నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న అనంతరం ఆయన మాట్లాడారు. రాజ్యాంగబద్ధంగా నాల్గవ మూల స్తంభంగా దేశ ప్రజాస్వామ్యాన్ని మీడియా కాపాడుతుందన్నారు. ఇందుకు మీడియా బాధ్యత వహిస్తుందన్నారు. సమాజంలోని రాజకీయాలను ఇతరత్రా సమస్యలను సమీక్షించి వార్తా కథనాలను ప్రసారం చేయడం సాధారణ విషయం అన్నారు.అయితే టిఆర్ఎస్ పార్టీకి సంబంధించి జరిగిన డిబెట్ సాకుగా చూపి మా టీవీ న్యూస్ ఛానల్ పై దాడి చేయడాన్ని కాంగ్రెస్ పార్టీ ఖండిస్తోంద న్నారు. దాడి చేసిన దుండగులపై తెలంగాణలోని అధికార కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుందని తెలిపారు. ఆ దుండగులను వెంటనే అరెస్ట్ చేశారని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో దర్యాప్తునకు ఆదేశించిందన్నారు. దాడి గురించి తెలిసిన వెంటనే పోలీసు అధికారుల బృందం మహా న్యూస్ ఛానల్ కార్యాలయాన్ని సందర్శించి దర్యాప్తు మొదలెట్టినట్లు తెలిపారు. ఈ దాడి పూర్తిగా మీడియా స్వేచ్ఛపై దాడిగా పేర్కొన్నారు. ఇందుకు బాధ్యులైన టిఆర్ఎస్ అధిపతులు కే. చంద్రశేఖర రావు, కే.రామారావు లు పూర్తిగా బాధ్యత వహించాలని హెచ్చరించారు.

మహా న్యూస్ కార్యాలయంపై దాడిని ఖండించిన బద్వేల్ మీడియా ప్రతినిధులు

విశాలాంధ్ర - బద్వేలు : తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని మహా న్యూస్ కార్యాలయంపై జరిగిన దాడిని ఖండిస్తూ బద్వేల్ పట్టణంలోని ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ర్యాలీ నిర్వహించారు.మీడియా స్వేచ్ఛకు భంగం కలిగించే ఈ ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన వారు, దాడి చేసిన వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకొని కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం బద్వేల్ పోలీస్ స్టేషన్‌ను చేరుకొని ఎస్ఐ సత్యనారాయణకు మెమోరాండం అందజేశారు.ఈ ర్యాలీలో పలువురు మీడియా సోదరులు పాల్గొని సంఘీభావం వ్యక్తం చేశారు.

కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ వర్కర్స్‌ను రెగ్యులరైజ్ చేసి

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరుమావిళ్ళ సుబ్బారాయుడు

విశాలాంధ్ర-మదనపల్లె: రాష్ట్రంలో మున్సిపాలిటీ, కార్పొరేషన్లలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ వర్కర్స్ ను రెగ్యులరైజ్ చేసి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరుమావిళ్ళ సుబ్బారాయుడు డిమాండ్ చేశారు .ఆదివారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు నేలపాటి శ్రీనివాసులు అధ్యక్షతన జరిగింది .ఈ సందర్భంగా సుబ్బారాయుడు మాట్లాడుతూ మదనపల్లి మున్సిపాలిటీలో పనిచేస్తున్న డైలీ వేజెస్ కార్మికులకు రావలసిన ఆరు నెలల వేతనాన్ని వెంటనే చెల్లించి వారికి కూడా ఆప్కాస్ లో అవకాశం కల్పించి ఈపిఎఫ్ , ఈఎస్ఐ సదుపాయం కల్పించాలని కోరారు. మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యల పైన ప్రభుత్వం వెంటనే స్పందించి వారి సమస్యలను పరిష్కారం చేసి గత 25 రోజులుగా సమ్మె చేస్తున్న కార్మికులకు న్యాయం చేయాలని, మున్సిపాలిటీ స్కూళ్లలో స్వీపర్స్ గా పని చేస్తున్న స్వీపర్లకు ప్రస్తుతం చెల్లిస్తున్న నాలుగు వేల రూపాయల వేతనం తో కార్మికులు చాలా ఇబ్బందులు పడుతున్నారని వీరికి కూడా కనీస వేతనాలను అమలు చేసి ఈపిఎఫ్ , ఈఎస్ఐ సౌకర్యం కల్పించి ఆప్కాస్ లో వాళ్ళ పేర్లను నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక సమస్యలు పరిష్కారం కోసం జూలై 9 న జరిగే సార్వత్రిక సమ్మెలో మున్సిపల్ వర్కర్స్ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.అనంతరం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ రద్దు చేసి నూతనంగా జిల్లా కన్వీనర్ గా ముభారక్,కో కన్వీనర్ గా నేలపాటి శ్రీనివాసులు ను ఎన్నుకున్నట్లు సుబ్బారాయుడు తెలిపారు .ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జొరోపల్లి రామచంద్రయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి పి.ఎల్ నర్సింహులు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గంగాధర్, సాంబశివ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు మస్తాన్, చలపతి నాయుడు, ఏఐటీయూసీ నాయకులు తిరుమల, దేవా, వాసు జానకి , రాధా తదితరులు పాల్గొన్నారు.

మహా న్యూస్ ఛానెల్ ప్రధాన కార్యాలయంపై జరిగిన

దాడిని తీవ్రంగా ఖండించిన నాయకులు

విశాలాంధ్ర-రాయచోటి రూరల్: జనసేనపార్టీ సీనియర్ నాయకులు రామ శ్రీనివాస్ మాట్లాడుతూ ఇటీవల హైదరాబాద్ లోని మహా న్యూస్ ఛానెల్ ప్రధాన కార్యాలయంపై చోటు చేసుకున్న దాడి అప్రజాస్వామి కంమంటూ.. మీడియాలో ప్రసారమయ్యే మరియు ప్రచురితమయ్యే వార్తలు, కథనాలపై అభ్యంతరాలు ఉంటే అబ్జక్షన్ తెలియచేసే విధానమంటూ ఉంటుందని ఇందుకు భిన్నంగా దాడులకు పాల్పడటం ప్రజాస్వామ్యంలో మీడియా అనేది ఎప్పటికప్పుడు ప్రజలకు క్షేత్ర స్థాయిలో సమాచారం అందిస్తుందని ఇటు ప్రజలకు అటు ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తుంది అటువంటి మీడియాపై దుశ్చర్యలకు పాల్పడి గొంతు నొక్కడం సమంజసం కాదంటూ.. మహా న్యూస్ ఛానెల్ పై జరిగిన దాడిని ప్రజాస్వామ్య వాదులు అందరూ తప్పనిసరిగా ఖండించాలని ఈ దాడికి పాల్పడిన వారిని పోలీసు శాఖ అధికారులు అదుపులోకి తీసుకుని విచారణ జరిపి కారకులైన వారిపై కూడా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ ఉన్నత స్థాయి ప్రభుత్వ అధికారులకు విజ్ఞప్తి చేశారు. మీడియా స్వేచ్ఛను హరించ చడం అంటే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసినట్లేనని ధ్వజమెత్తారు. అలాంటి పరిస్థితులు సమాజానికి పెను ప్రమాదం అని తెలిపారు.

మీడియా వ్యవస్థపై దాడి దుర్మార్గం

విశాలాంధ్ర-రాయచోటి రూరల్ :సమాజంలో నాలుగో స్తంభం లాగా కొనసాగుతూ ఎక్కడెక్కడో జరిగే విషయాలను ప్రజలకు తెలియజేస్తూ,ప్రభుత్వ తప్పులను ఎప్పటికప్పుడు ఎత్తిచూపుతూ న్యాయం వైపు పోరాడుతున్న మీడియా వ్యవస్థపై దాడి దుర్మార్గపు చర్య అని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ళ రంగారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మహా న్యూస్ ఛానల్ కార్యాలయంపై దాడి చేయడం అమానుషమన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధి లాగా పని చేసే వివిధ మీడియా చానళ్ళు,పత్రికలపై దాడి చేయడం ప్రజాస్వామ్య విలువలను కాలరాయడమేనన్నారు. ప్రతినిత్యం సమాజంలో జరిగే ఎన్నో విషయాలను రాజకీయ నాయకులకు, అధికారులకు, ప్రజలకు అవగాహన కలిగించే ఛానల్ పైన దౌర్జన్యం చేయడం మంచి పద్ధతి కాదన్నారు.మహా న్యూస్ ఛానల్ పై దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

సెమిస్టర్ ఫలితాలలో

ఎస్‌కేఎస్సీ డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: యోగివేమన యూనివర్సిటీ ప్రకటించిన 2, 4వ సెమిస్టర్ ఫలితాలలో తమ కళాశాల విద్యార్థులు అత్యధిక గ్రేడులు సాధించారని ఎస్‌కేఎస్సీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. 2వ సెమిస్టర్ బీఎస్సీ బయోటెక్నాలజీలో ఎం.వాణి-9.75, టి.సుప్రజ -9.75, బీకాం కంప్యూటర్‌లో బి.ఫర్హానా-9.67, బీఏ హిస్టరీలో ఖుషీ యాదవ్-9.67, ఎస్ఎం కరీముల్లా-9.67, బీఎస్సీ కంప్యూటర్స్‌లో ఎస్.దిల్‌షాద్-9.50, ఏఎస్ ముస్కాన్-9.42, బీఏ హిస్టరీలో ముస్తఫా-9.33, ఎస్.బిబి ముస్కాన్-9.33, ఎస్.గౌసియా-9.33, వీ.జ్యోత్స్న-9.00, ముంతాజ్-9.00 సాధించారని తెలిపారు. అలాగే 4వ సెమిస్టర్ బీకాం కంప్యూటర్స్‌లో జీ.మౌనిక-9.15, బీఎస్సీ బయో టెక్నాలజీలో టి.మల్లికార్జున-9.10, బీఏ హిస్టరీలో ఏ.బసీరూం -8.80, అంజలి-8.80, ఎస్.శ్రావణి-8.60, బీఎస్సీ కంప్యూటర్స్‌లో వీ.అనిత-8.75 అత్యధిక గ్రేడులు సాధించారని అన్నారు. అత్యధిక గ్రేడులు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు అధ్యాపక, అధ్యాపకేతర బృందం అభినందనలు తెలిపారు.

పత్రికా రంగంపై దాడి చేయడం దుర్మార్గం

ఎన్.డి. విజయ జ్యోతి, డీసీసీ అధ్యక్షురాలు ఖండన

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : హైదరాబాద్ నందు మహా న్యూస్ కార్యాలయం మీద బీఆర్ఎస్ పార్టీ దుండగులు చేసిన దాడిని హేయమైన చర్య గా, ఈ దాడిని విజయ జ్యోతి తీవ్రంగా ఖండించింది, ఆదివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి ఒక ప్రకటన విడుదల చేశారు. పత్రికలు, న్యూస్ ఛానల్స్ జరుగుతున్న పరిణామాలనే వార్తల రూపంలో ప్రజలకు తెలియజేప్పే భాధ్యత తీసుకుంటాయి. మహా న్యూస్ ముందునుంచి ప్రజల పక్షాన ఉంటూ వాస్తవలను వెలుగులోకి తెచ్చే ప్రయత్నం చేస్తూ ఉంటుంది ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో పీకల లోతుకు కురుకుపోయిన కేసీఆర్, కేటీఆర్‌లు ప్రజల దృష్టి మరల్చేందుకే ఇలాంటి నీచమైన కార్యక్రమం చేపట్టారు, తెలంగాణ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి గారు బేషజాలకు పోకుండా ఈ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని సిబిఐ కి అప్పగించి ఈ బీఆర్ఎస్ నాయకులను చట్ట ప్రకారం చర్య తీసుకో వలసిందిగా అభ్యర్థి స్తున్నాను దాడికి పాల్పడ్డ వారు ఎంతటి వారైనా సరే అరెస్ట్ చేసి కేసులు నమోదు చేసి,, కార్యాలయానికి జరిగిన నష్టాన్ని దాడిచేసిన వారినుంచే వసూలు చేసి జైల్లో వేసి పత్రికా స్వేచ్ఛ ను కాపాడాలని, మున్ముందు ఇలాంటి ఘటనలు జరగ కుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

గురుకులాన్ని తరలించాలని చూస్తే ఉద్యమం



విశాలాంధ్ర -బ్రహ్మంగారి మఠం : మండలంలో తోట్లపల్లి మహ గురుకులం లో ఉన్నపాటుగా ఓపెన్ చేసి తరగతులు నిర్వహించాలని పక్కనే ఉన్న అంబేద్కర్ గురుకుల పాఠశాలను విలీనం చేయాలని చూస్తే సహించమని పార్టీ ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శని వారం మఠం లోని అంబేద్కర్ గురుకుల పాఠశాలను సిపిఐ మండల కార్యదర్శి పెద్దల్లపల్లి ప్రభాకర్ సిపిఎం మండల కార్యదర్శి సునీల్ కుమార్ ఎంఆర్పిఎస్ మండల అధ్యక్షులు జ్ఞానేశ్వర్ సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1974లో ఏర్పాటైన అంబేద్కర్ గురుకుల పాఠశాల ఎన్నో ఏళ్ళుగా సమాజంలో విద్యార్థులను ఉన్నత స్థాయిలోకి తీసుకెళ్లడానికి ఎంతో మందికి జీవిత పాఠాలు నేర్పిన అంబేద్కర్ గురుకులాన్ని తరలించాలని చూస్తే పోరాటం చేస్తామని నాయకులు డిమాండ్ చేశారు. అంబేద్కర్ గురుకులాన్ని తరలించాలని ముందు విద్యార్థుల తల్లిదండ్రులకు ఏమైనా సమాచారం ఇచ్చారా అని వారు ప్రశ్నించారు. పాఠశాల తరలింపు విషయంలో విద్యా కమిటీ సమావేశం నిర్వహించి ఏమైనా సమావేశంలో తీర్మానాలు చేశారా అని వారు ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శులు సోమిరెడ్డిపల్లి నారాయణ, చేజర్ల రవి ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు ఓబన్న విద్యార్థి ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆఫ్ పాకాల నూతన కార్యవర్గం ఎన్నిక



విశాలాంధ్ర-పాకాల: పాకాల మండలానికి చెందిన లైన్స్ క్లబ్ ఆఫ్ పాకాల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. డిస్ట్రిక్ట్ 317 ఈ జూన్ పర్సన్ మార్సాని విజయబాబు అధ్యక్షతన ఆదివారం సమావేశమైన లైన్స్ క్లబ్ సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ పాకాల ప్రెసిడెంట్ గా అనీల్ పోతుగుంట, సెక్రటరీగా మారసాని మహేష్ బాబు, ట్రెజరర్ గా మారసాని నాగేంద్ర, ఫస్ట్ వైస్ ప్రెసిడెంట్ గా నెల్లూరు ధనంజయను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు మారసాని విజయబాబు తెలిపారు. వీరి పదవీ కాలం 2025 జూలై ఒకటో తేదీ నుంచి 2026 జూన్ 30 వ తేదీ వరకు ఉంటుందని చెప్పారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ పేద ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఎంతో కృషి చేస్తోందని ఆయన వివరించారు. ఇందులో భాగంగా గ్రామీణ ప్రజలకు సరైన వైద్యం అందించేందుకు లయన్స్ క్లబ్ ఆఫ్ పాకాల కృషి చేస్తుందన్నారు. త్వరలో పాకాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ పాకాల ఆధ్వర్యంలో హెల్త్ కేర్ సెంటర్ ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఇందులో తొలుత డయాబెటిక్, గైనికాలజీ, ఆర్థో, న్యూరో సేవలు అందించనున్నట్లు వివరించారు. అటుతర్వాత కార్డియాలజీ సేవలు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

పోలవరం పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

విశాలాంధ్ర-పూతలపట్టు: పూతలపట్టు మండలం పోలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1981 82 నుండి 1985 86 వరకు విద్యాభ్యాసం చేసిన ఆనాటి విద్యార్థులు అందరూ వివిధ ప్రాంతాల్లో వివిధ హెూదాలలో జీవితాలను గడుపుతున్న ఆనాటి విద్యార్థులు విద్యను నేర్పిన ఆనాటి గురువులు ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో కలసి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు .45 వేల తర్వాత ఒకరిని ఒకరు కలుసుకోవడం గత స్మృతులను నెమరు వేసుకొని వారి వయసును కూడా మరిచిపోయి ఎంతో ఆప్యాయంగా ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ ఇక్కడ ఎంతో ఉత్సాహంగా గడిపారు. 1981 82 నుండి 1985 86 వరకు పదవ తరగతి చదువుకున్న అప్పటి విద్యార్థులందరూ తాము చదువుకున్న పాఠశాల ఆవరణలో అపూర్వముగా కలుసుకున్నారు. ఆయా సమయాల్లో తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను ఆహ్వానించి ఘన్నుగా సన్మానించుకున్నారు తమకు బోధించిన ఉపాధ్యాయులే కాకుండా ఆయా సమయాల్లో చదువుకున్న విద్యార్థులను కూడా వివిధ వృత్తులలో స్థిరపడి కొందరు ప్రభుత్వ ఉద్యోగులు చేస్తున్న వారు ఉండటం గమనించదగ్గ అంశంఆ సమయంలో బోధించిన ఉపాధ్యాయులు జయరాం రెడ్డి, మనీ, వనజ శ్యామల, పూలమాలలు శాలబాలతో ఘనంగా సత్కరించారు. పాఠశాలకు సౌండ్ సిస్టం అందజేశారు .కార్యక్రమంలో స్థానిక ప్రధాన ఉపాధ్యాయులు సురేష్ ,తదితరులు పాల్గొన్నారు.

కూటమి మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం

మాజీ సీఎం వైఎస్ జగన్ హయాంలో ప్రజలకు జరిగిన మేలును వివరిద్దాం

విశాలాంధ్ర - వెంకటగిరి : చంద్రబాబు ఏడాది పాలనలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా చేసినమోసాలను ప్రజల్లో కి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని ఈ క్రమంలో జూలై 8వ తేదీన వెంకటగిరి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెంకట గిరి నియోజకవర్గం వైఎస్ఆర్సిపి సమన్వయకర్తనేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డితెలియజేశారు ఆదివారం వెంకటగిరి లోని నేదురుమల్లి నివాసం ఎన్ జే ఆర్ భవన్ లో వైఎస్సార్సీపీ కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలముందు కూటమి నాయకులు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా హామీలను అమలు చేయకపోవడంతో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారన్నారు మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నవరత్నాలను పకడ్బందీగా అమలు చేస్తున్న సమయంలో రాష్ట్రం శ్రీలంక అవుతుంది అని చెప్పిన సీఎం చంద్రబాబు , సంపద సృష్టించడం తనకు తెలుసని తాను ఇస్తున్న సూపర్ సిక్స్ హామీలను నెరవేరుస్తానన్న మాటను ఆయన తప్పారని విమర్శించారు చంద్రబాబు హయాంలో ఏ పంటను సాగుచేసిన రైతు కూడా ఆనందంగా లేరని గిట్టుబాటు ధరలు అందించకుండా వ్యవసాయ రంగాన్ని గాలికి వదిలేసారని తెలిపారువైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని పూర్తి స్థాయిలో నిర్వీర్యం చేయాలన్న కుట్రలతో చంద్రబాబు సర్కార్ రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందన్నారు.వైఎస్ఆర్సిపి కార్యకర్త సింగయ్య మృతి ఘటనలో మాజీ సీఎం వైఎస్ జగన్ పై కేసు నమోదు పై న్యాయస్థానం అక్షింతలు వేసిందని గుర్తు చేశారు.

పాండురంగా రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన నేదురుమల్లి



విశాలాంధ్ర- వెంకటగిరి: వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి వెంకటగిరి రూరల్ మండలంలోని యాతలూరు గ్రామానికి చెందిన జంగాలపల్లి పాండురంగారెడ్డి కుటుంబాన్ని ఆదివారం పరామ ర్శించారు. నేదురుమల్లి కుటుంబానికి అత్యంత సన్నిహితుడు జంగాలపల్లి చిరంజీవులు రెడ్డి ఈనెల 11వ తేదీన స్వర్గస్తులైనారు. ఆదివారం చిరంజీవులు రెడ్డి నివాసం వద్ద జరిగిన ఉత్తరక్రియలు కార్యక్రమంలో నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. తొలిత చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కొంతసేపు స్థానిక కార్యకర్తలతో మాటా మంతి తో స్థానిక స్థితిగతులపై అడిగి తెలుసుకున్నారు.

కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సదస్సు

విశాలాంధ్ర-తిరుపతి: కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఎస్.యూ.సి.ఐ (కమ్యూనిస్టు) - సోషలిస్టు యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా (కమ్యూనిస్ట్) పార్టీ ఆధ్వర్యంలో యూత్ హాస్టల్ నందు సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య వక్తగా హాజరైనటువంటి కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు కామ్రేడ్ సి.హెచ్.ప్రమీల మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం అయినప్పటికీ ఏ హామీలైతే చెప్పి ప్రజలను నమ్మించి ఎన్నికల్లో గెలిచారో అవే హామీలను అమలు చేయడం లేదని అన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అన్నిటిని అమలు చేయలేదని అరాకొర పథకాలు అమలు చేసి కాలాన్ని వెళ్లదీస్తున్నదని నిలదీశారు. మరో వైపు ప్రజలకు కావాల్సింది పథకాల పేరుతో బిచ్చం రూపంలో డబ్బులు ఇవ్వడం కాదని నాణ్యమైన విద్య, వైద్యాన్ని ఉపాధిని అందించాలని, నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని, కరెంట్ ఛార్జిలను తగ్గించాలని అన్నారు. స్కూల్ వర్కర్స్ కు పెండింగ్ లో వున్న జీతాలను తక్షణమే విడుదల చేయాలని కోరారు. బిజెపితో కూటమి ప్రభుత్వ భాగస్వామ్యంలో ఉన్న టిడిపి, జనసేన పార్టీల నాయకులు ఆంధ్రప్రదేశ్ లో ప్రతిష్టాత్మకమైన విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపాలని ఎందుకు కేంద్ర బిజెపి ప్రభుత్వంను ప్రశ్నించడం లేదని ప్రశ్నించారు.ఎన్నికలకు ముందు జీవో 117 ను తాము అధికారంలోకి వస్తే అమలు చేయబోమని చెప్పిన కూటమి ప్రభుత్వము, అధికారంలోకి వచ్చిన వెంటనే రకరకాల పేర్ల మీద రేష్నలైజేషన్ పేరు ప్రభుత్వ పాఠశాలల మూసివేతను కొనసాగిస్తూనే ఉన్నాయని. తిరుపతి జిల్లాలో సుమారు 600 స్కూల్స్ మూసి వేయడానికి ముందుకెళ్తున్నారని దుయ్యబడ్డారు. ఈ సదస్సుకు వక్తగా హాజరైన రాఘవ గారు మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యము, ఉపాధి కల్పించడం ప్రభుత్వం ప్రాథమిక కర్తవ్యం అని గుర్తు చేశారు. అలా చేయాలని పరిస్థితులలో ప్రజలే ఐక్యమై ఉద్యమించాలని అన్నారు. కమ్యూనిస్ట్ పార్టీ నగర ఇంచార్జ్ ఏ.హరీష్ మాట్లాడుతూ చిన్నపాటి వర్షం పడిన నగరంలోని రోడ్లన్నీ జలమయం అవుతున్నాయని, దీనికి తగిన చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలం అవుతున్నారని అన్నారు.మరోవైపు డ్రగ్స్, మద్యాన్ని విచ్చలవిడిగా సరఫరా చేస్తున్నారని, డ్రగ్స్ తయారయ్యే మూలాలను గుర్తించి దీని వెనక వున్న బడా వ్యాపారస్తులను శిక్షించడం పక్కనబెట్టి, డ్రగ్స్ సరఫరాను ఆపాల్సింది పోయి ప్రజలందరినీ పక్కదారి పట్టించే విధంగా ప్రభుత్వ అధికారులు, నాయకులే బ్యానర్లు పట్టుకుని యువతకు, విద్యార్థులకు సందేశాలివ్వడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు.మరోవైపు రుయా, స్విమ్స్ హాస్పిటల్ లో శాశ్వత ప్రాతిప దికన పోస్టులు భర్తీ చేసి నాణ్యమైన వైద్యాన్ని అందించాలని, ప్రతిష్టాత్మకమైన యూనివర్సిటీలో ఖాళీగా వున్న పోస్టులు భర్తీ చేసి అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐఎంఎస్ఎస్ మహిళా సంఘం నాయకురాలు ఎల్.ఎన్. లక్ష్మి, ఆంధ్ర ప్రదేశ్ యునైటెడ్ స్కూల్ వర్కర్స్ యూని యన్ నాయకులు వెంకటసుబ్బయ్య, ఏ.ఐ.డి.ఎస్.ఓ విద్యార్థి సంఘం నాయకులు ఎన్.నవీన్ కుమార్ మరియు కమ్యూనిస్టు పార్టీ నాయకులు ప్రతాప్, అమీనా, మొబీనా, విద్యార్థి సంఘం నాయకులు తేజశ్రీ, ఉన్నతి, ఇషాక్, ధీరజ్, తులసి పాల్గొన్నారు.

సమాజం మార్పు సాహిత్యం తోనే సాధ్యం

వీక్షణం సంపాదకుడు వేణుగోపాల్

విశాలాంధ్ర- పలమనేరు : సమాజ మార్పు సాహిత్యంతోనే సాధ్యమని వీక్షణం సంపాదకుడు ఎన్.వేణుగోపాల్ తెలిపారు అందులో భాగంగా ఆదివారం పట్టణంలోనే లయన్స్ క్లబ్ లో పలమనేరు బాలాజీ రచించిన రెండు పుస్తకాల పరిచయ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వేణుగోపాల్ మాట్లాడుతూ..తెలుగు సాహిత్యంలో ఎరుకల జీవన గాథలను తొలిసారిగా వెలుగులోకి తీసుకువచ్చిన రచయిత పలమనేరు బాలాజీ అనిఅన్నారు. మానవ సంబంధాల గురించి కథలు కవిత్వం ద్వారా సమాజానికి మంచి రచనలు పలమనేరు బాలాజీ అందించారని ప్రముఖ రచయిత్రి వి.ప్రతిమ అన్నారు.ప్రపంచ సాహిత్యంలో ఆదివాసీలకు సంబంధించిన ముఖ్యమైన సాహిత్య చరిత్ర అందరూ అధ్యయనం చేయాల్సి ఉంటుందని, ఇదే క్రమంలో తెలుగు ఆదివాసి సమాజంలో ఎరుకల జీవితాలను వెలుగులోనికి తీసుకొని వచ్చి , ఎరుకల జీవితంలోని ఉద్వేగాలను కథలుగా పలమనేరు బాలాజీ మలచారని ప్రముఖ రచయిత సుంకోజి దేవేంద్రాచారి చారి అన్నారు.పలమనేరు బాలాజీ ఎరుకల కథలు ఏకలవ్య కాలనీ, కవిత్వం లోపలేదో కదులుతున్నట్టు పుస్తకాలను సభకు ప్రముఖ రచయితలు కవులు పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత పల్లిపట్టు నాగరాజు, ప్రముఖ రచయితలు మంచికంటి, టి ఎస్ ఏ కృష్ణ మూర్తి, కృష్ణ స్వామి రాజు,కవితశ్రీ, ఎండపల్లి భారతి, పి. తులసి నాదం నాయుడు, జక్కన్న, తొండవాని గోపీనాథ్, పేట యుగం ధర్, మురిశెట్టి గోవిందు, మేఘనాధ రెడ్డి,సీఎన్ చంద్రశేఖర్, వంగాల సంపత్ రెడ్డి, గిరిధరమూర్తి ,యుగంధర్, షేక్ హసీనా బేగం, పత్తిపాటి రమేష్ నాయుడు, గండికోట వారిజ, సిహెచ్ నాగార్జున శర్మ, చంద్రశేఖరయ్య, దోర్నాదుల సిద్ధార్థ, సంధ్యా శర్మ, ఎర్రయ్య, మల్లెల నాగరాజు, పివి ప్రసాద్, బ్రహ్మానంద్, నవ్యాంధ్ర రచయితల సంఘం చిత్తూరు జిల్లా అధ్యక్షురాలు కరణం విమల, రెడ్ క్రాస్ అసోసియేషన్ నాయకులు ఎంఆర్ సహదేవ నాయుడు, రసజ్ఞుల సమాఖ్య శ్రీపురం సీతారామయ్య, ఎన్జీవో నాయకులు ఆనంద్, లక్ష్మీపతి, రైతు నాయకులు ఉమాపతి నాయుడు పాల్గొన్నారు.

రాష్ట్ర పరిస్థితి పెనం నుంచి జారి

పొయ్యిలో పడినట్లు ఉంది

విశాలాంధ్ర -తిరుపతి కలెక్టరేట్ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్ర పరిస్థితి పెనుములో నుంచి జారి పొయ్యిలో పడినట్లు ఉందని బిసివై పార్టీ అధినేత బోడె రామచంద్ర యాదవ్ పేర్కొన్నారు. తిరుచానూరు లోని శ్రీ ఆది వారాహి అమ్మవారిని దర్శించుకున్న ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి పబ్లిసిటీ పిచ్చితో కోట్ల రూపాయలు దుర్వినియోగం చేస్తుందని అన్నారు. రాష్ట్రంలో హిందూ దేవాలయాలపైన, దళితులపైన, రైతుల పైన, బీసీల పైన, మహిళల పైన అనేక దాడులు చేసుకుంటూ కూటమి ప్రభుత్వం అవినీతిని ప్రోత్సహిస్తున్నారని అన్నారు. దానికి ఉదాహరణ హిందుత్వానికి ఎంతో ప్రసిద్ధిగాంచిన తిరుచానూరు లోనే అక్రమ ఇసుక రవాణాకు, రియల్ ఎస్టేట్ కు అడ్డుగా భావించి ఆదివారాహి అమ్మవారు, నాగాలమ్మ అమ్మవారి దేవాలయాలను కూల్చివేత దీనికి ఉదాహరణ అని అన్నారు. కూటమి ప్రభుత్వం, పూర్వం మహమ్మదీయుల పాలన కంటే దారుణంగా తయారయిందని అన్నారు. ఇలాంటి ఘటనలే కూటమి ప్రభుత్వానికి హిందుత్వంపై ఉన్న చిత్తశుద్ధికి ఉదాహరణగా ప్రజలందరూ తెలుసుకోవాలన్నారు. తిరుచానూరులో ధ్వంసం అయిన ఆలయాలు తిరిగి నిర్మించి కూటమి ప్రభుత్వం తమ చిత్త శుద్ధిని నిరూపించుకోవాలని లేదంటే బీసీవై పార్టీ, హిందువుల పక్షాన నిలిచి ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

మహానాడు కార్యక్రమంలో పాల్గొన్న కురుగొండ్ల

విశాలాంధ్ర-వెంకటగిరి : సింగపూర్ దేశం లో మాజీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి, నట సార్వభౌమ శ్రీ నందమూరి తారకరామారావు 102వ జయంతి సందర్భంగా మహానాడు కార్యక్రమంలో అప్పలనాయుడు, తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు మాధవల నాయుడులతో కలిసి పాల్గొన్న వెంకటగిరి శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ" ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు యోగేశ్వరరావు, కలువాయి మండల నాయకులు బొట్టా హజరత్ నాయుడు, సింగపూర్ తెలుగు ప్రజలు, తదితరులు పాల్గొనడం జరుగుతుంది.

డైట్ ప్రిన్సిపాల్‌గా చిత్తూరు డీఈవో వరలక్ష్మి

విశాలాంధ్ర - కార్వేటినగరం: జిల్లా విద్యాశిక్షణా సంస్థ (డైట్) ప్రిన్సిపాల్గా చిత్తూరు డీఈవొ బి.వరలక్ష్మి ఆధివారం బాధ్యలు చేపట్టారు. గతంలో డైట్ ప్రిన్సిపాల్గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ శేఖర్ పదవీవిరమణ పొందడంతో చిత్తూరు జిల్లా డీఈవొగా విధులు నిర్వహిస్తున్న వరలక్ష్మి డైట్ ప్రిన్సిపాల్గా (ఎఫ్ఏసీ) బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న డైట్ కళాశాలల్లో అత్యున్నత స్థానంలో ఉన్న కార్వేటినగరం డైట్కు ప్రిన్సిపాల్గా బాధ్యతలు చేపట్టడం తమ అదృష్టంగా బావిస్తున్నానని తెలిపారు. అధ్యాపకులు సమయ పాలన పాటించి అత్యుత్తమ ఫలితాలు సాధించే ఒకగా విధులు నిర్వహించి డైట్ కాలాశాలకు మరింత పేరు ప్రతిష్టలు తీసుకు రాల సూచించారు. ఈక్రమంలో భాగంగా కళాశాల అధ్యాపకులు ప్రిన్సిపాల్గా బాధ్యలు తీసుకున్న డీఈవొ వరలక్ష్మికి పుష్పగుచ్చాలు అందించి, శాలువలు కప్పి ఘనంగా సన్మానించారు.

డీవీ సత్రంలో వాహనాల తనిఖీలు

వాహనాలపై ప్రెస్, పోలీస్ స్టిక్కర్లు ఉంటే చర్యలు

విశాలాంధ్ర-దొరవారిసత్రం: మద్యం సేవించి ఎలాంటి వారైనా వాహనాలను నడిపితే అలాంటి వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై అజయ్ కుమార్ హెచ్చరించారు. దొరవారి సత్రం మండల పరిధిలోని తల్లంపాడు టోల్ ప్లాజా వద్ద ఆదివారం వాహనాలు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై అజయ్ కుమార్ వాహన చోదకులతో మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా హెల్మెంట్ ధరించి వాహనాలు నడపలన్నారు. ముఖ్యంగా ఆటో వారు పరిమితి మించి ప్రయాణికులను ఎక్కించుకొని నడపకూడదన్నారు. ప్రతి వాహనాదారులు డ్రైవింగ్ లైసెన్సు, ఫిట్నెస్ సర్టిఫికెట్లు, ఇన్సూరెన్స్, కచ్చితంగా ఉండాలన్నారు. అనాధికారిక స్టిక్కర్లు ఉంటే చర్యలు తప్పవ వాహనాలపై ఎవరైనా సరే అనాదిక కరంగా పోలీస్, ప్రెస్, ఇతర ప్రభుత్వ, ప్రైవేటు కరణ స్టిక్కర్లను వేసుకుంటే చర్ల తప్పువు అన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నిత్యం వాహనాలు తనిఖీలు చేపడుతున్నామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం

విశాలాంధ్ర-వెదురుకుప్పం: శ్రీ రంగరాజపురం మండలంలోని చిత్తూరు పుత్తూరు జాతీయ రహదారి మగ్రిపల్లి వద్ద రోడ్డు ప్రమాదం చోటు చేసుకుని ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందిన ఘటన ఆదివారం జరిగింది. ఈ ప్రమాదంలో తల మొండెం వేరవడంతో స్థానికులు కలవరపాటుకు గురయ్యారు. పోలీసుల కథనం మేరకు వెదురుకుప్పం మండలం పెరుమాళ్ళ పల్లి గ్రామానికి చెందిన రమేష్ (44), శ్రీరంగరాజపురం మండలంలోని క్షీరసముద్రం గ్రామంలోని వారి సమీప బంధువు అనారోగ్యంతో మృతి చెందిన నేపథ్యంలో వారి దహన క్రియలకు హాజరై తిరుగుప్రయాణం లో చిత్తూరు పుత్తూరు జాతీయ రహదారి మగ్రిపల్లి గ్రామం వద్ద గ్రానైట్ తో వస్తున్న టాటా ఏసీ వాహనం వేగంగా వచ్చి బలంగా ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో రమేష్ అక్కడికక్కడే మృతి చెందడం జరిగిందని తెలిపారు. ఈ ప్రమాదంలో రమేష్ తల మొండెం, తల భాగం వేరవ్వడం తో అప్పటికే మృతి చెందినట్లు చెబుతున్నారు. డ్రైవర్ నిర్లక్ష్యంగా వేగంతో వాహనం నడపడంతోనే ఈ ప్రమాదం సంభవించిందని స్థానికులు స్థానికులు చెప్పారన్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుమన్ తెలిపారు.

ఆలయం వద్ద అన్నదానం

విశాలాంధ్ర - కార్వేటినగరం : కార్వేటి నగరం లోనే ద్రౌపతి సమేత ధర్మరాజుల స్వామి వారి ఆలయం వద్ద నాగరాజు వారి కుమార్తె రూప 300 మందికి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు మేళం రవి యాదవ్, ఉపాధ్యక్షులు రవి రెడ్డి, కార్యదర్శి గౌతమ్ రాజు, ఉప కోశాధికారి సాయి రాయల్, భక్తులు ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తులసి నాయని పల్లిలో మోడల్ స్కూల్‌లో ముఖ్యమంత్రి బహిరంగ సభ

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

విశాలాంధ్ర -తిరుపతి: ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఆయన పాల్గొనే కార్యక్రమాలు నిర్వహించనున్న ప్రదేశాలను ముందస్తు పర్యటన ఏర్పాట్లలో భాగంగా ఆదివారం కలెక్టర్ సుమిత్ కుమార్, కడా పీడీ వికాస్ మర్మత్ ఏర్పాట్లు పనులను పరిశీలించారు. తుమ్మిశి పంచాయతీ డుంకుమానిపల్లెవద్ద హెలిప్యాడ్ ప్రాంతానికి వెళ్లి అక్కడ చేయాల్సిన ఏర్పాట్ల గురించి అధికారులకు సూచనలుచేశారు. అనంతరం తిమ్మరాజుపల్లె చేరుకుని, స్థానికులతోను, టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులతో సమావేశమయ్యారు. బహిరంగ సభ ఏర్పాట్ల గురించి చర్చించారు.కుప్పం మండల సచివాలయంలో నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రభుత్వ విభాగాలకు చెందిన అధికారులతో సమావేశమయ్యారు. ముఖ్యమంత్రి పర్య టన నేపథ్యంలో వారివారి శాఖల పరిధిలో జరుగున్న అభివృద్ధి పనులపై సమగ్ర డీపీఆర్ తయారు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు. రేపటి రోజు ముఖ్యమంత్రి పర్యటన సంబంధించిన కార్యక్రమాలపై అధికారికంగా ప్రకటన విడుదల కానున్నది.

మహా న్యూస్ కార్యాలయంపై

దాడిని ఖండించిన పుత్తూరు జర్నలిస్టులు

విశాలాంధ్ర-పుత్తూరు: తెలంగాణలో మహా న్యూస్ కార్యాలయం మరియు ప్రతినిధులపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ, పుత్తూరు పట్టణంలోని ఆదివారం అంబేద్కర్ సర్కిల్ వద్ద స్థానిక జర్నలిస్టులు నిరసన తెలిపారు. పత్రికా స్వేచ్ఛను అణచివేయాలనే దాడులను ఖండిస్తూ, మీడియాపై దాడి ప్రజల స్వేచ్ఛపై దాడి అనే నినాదాలతో వారు ప్లకార్డులు ప్రదర్శించారు. నగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముత్తు ఆధ్వర్యంలో జర్నలిస్టులు, పుత్తూరు పోలీస్ స్టేషన్‌ను సందర్శించి, ఏఎస్ఐ పొన్ను స్వామికి తమ నిరసన పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్ జర్నలిస్టులు, స్థానిక మీడియా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. పత్రికా స్వేచ్ఛను హరించేందుకు జరిగే ప్రతి ప్రయత్నాన్ని ప్రతిజ్ఞాబద్ధంగా ఎదిరిస్తాం" అని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు రవి వర్మ రాజు సూర్యనారాయణ వర్మ రాజ్ లోకేష్ గుణ పడవేటయ్య ముత్తు అభి తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా లక్కాగృహదహనం

విశాలాంధ్ర -కార్వేటినగరం: కార్వేటినగరంలో వెలసి ఉన్న శ్రీదౌపదీ ధర్మరాజుల స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి లక్కాగృహ దహనం కార్యక్రమాన్ని భక్తులకు కనులకు కట్టి నట్లు శ్రీవెంకటేశ్వర నాటక కళామండలి ప్రదర్శించారు. అదే విధంగా మధ్యాహ్నం భాగవతారిణి రెడ్డెమ్మ పాండవులు అరణ్యవాసంలో ఉన్నప్పుడు చేసిన లక్కాగృహ దహనాన్ని భక్తులను ఆకట్టుకునే విధంగా అభివర్ణించారు. ఉదయం ద్రౌపదీ ధర్మరాజుల వారి మూల విరాట్కు అర్చనకలు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఉభయ దారులైన రజక కలసులు అమ్మవారికి సమర్పించిన సారెతో ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఉత్సవ మూర్తులతో పాటు శ్రీకృష్ణుని సుందరంగా అలంకరించి ప్రత్యేక వాహనంపై ప్రతిష్ఠించి మంగళవాయిద్యాలు, బాణా సంచలు పేలుస్తూ గ్రామ వీదుల్లో అంగరంగ వైభవంగా ఊరేగించారు. భక్తులు ఇంటింటా కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే మధ్యాహ్నం నాగరాజుయాదవు కుటుంబ సభ్యులు భక్తులకు అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు రవియాదవు ప్రధాన కార్యదర్శి గౌతమ్ రాజు, ఉపాధ్యార్థులు కట్టరపరెడ్డి, కోశాధికారి లక్ష్మీపతి, ఉపకోశాధికారి సాయిరాయల్, ఉత్పతులు సుమన్యోదవు, బాబాఆచారి,కుమార్ ఆచారి పలువురు భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రీస్తు రాజు దేవాలయంలో స్వస్థత సభలు

విశాలాంధ్ర- బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి మండల కేంద్రంలోని క్రీస్తు రాజు దేవాలయం చర్చిలో గత రెండు రోజులుగా జరిగినటువంటి స్వస్థత సభలు ఈరోజుతో ముగిసినాయి. ఈ సభలలో ఏసుప్రభువు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రార్థనలు జరపడం జరిగినది.కర్ణాటక తమిళనాడు రాష్ట్రాల నుండే కాక చుట్టుపక్కల నియోజకవర్గాల నుండి కూడా భక్తులు ఇక్కడికి వచ్చి స్వస్థత సభలలో పాల్గొని ప్రార్థనలు చేయడం జరిగినది.

భక్తులతో పోటెత్తిన బోయకొండ

భక్తుల సౌకర్యాలు దగ్గరుండి పరివేక్షించిన ఈ.ఓ ఏకాంబరం

విశాలాంధ్ర -చౌడేపల్లి : ప్రముఖ పుణ్యక్షేత్రం,భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్ళి బోయకొండ గంగమ్మ దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. ఇటు ఆంధ్రప్రదేశ్ అటు కర్ణాటక,తమిళనాడు ల నుండి ఆషాడం మాస్ ప్రారంభం సందర్భంగా భక్తులు అధికంగా వచ్చారు,భక్తులు ఉదయం నుండి క్యూలైన్లలో అమ్మవారి మొక్కులు తీర్చుకోవడానికి బారులు తీరారు.ప్రధాన అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కార్యనిర్వాహణాధికారి మరియు ఉపకమీషనర్ ఏకాంబరం ఏర్పాట్లను పరిశీలించారు.

ఆకట్టుకున్న హిడింబాసుర, బకాసుర వధ

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న ధర్మరాజస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మూడవ రోజైన ఆదివారం హిడింబాసుర, బకాసుర వధ ఘట్టం ఆకట్టుకుంది. ధర్మరాజస్వామి ఆలయ ప్రాంగణంలో ఈ ఘట్టం ప్రదర్శించారు. బీముడు పద్యాలు ఆలపిస్తూ హిడింబాసుర, బకాసురుని వధించడం భక్తులను ఆకట్టుకుంది. ఈ వేడుక తిలకించడానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. కాగా ఉదయం భీముడు పురవీధుల్లో ఊరేగుతూ బిక్షాటన చేశారు. పురవీధుల్లో బిక్షాటన చేస్తున్న బీముని దర్శించుకోవడానికి భక్తులు బారులు తీరారు. కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

తపాలా శాఖ ఉద్యోగుల సంఘం

కార్యదర్శిగా వేలూరు సుబ్రహ్మణ్యం

విశాలాంధ్ర-చౌడేపల్లి: ఆదివారం పుంగనూరు తపాలా శాఖ బ్రాంచ్‌లో ఆల్ ఇండియా గ్రామీణ తపాలా శాఖ ఉద్యోగుల సంఘం ఎన్నికలలో కార్యదర్శిగా వేలూరు సుబ్రహ్మణ్యం అధ్యక్షుడిగా కుదురు చిమనపల్లి బ్రాంచ్ నారాయణరెడ్డి కోశాధికారిగా కృష్ణమూర్తి లు ఎన్నికైనట్లు వారు తెలిపారు. గ్రామీణ తపాలా శాఖ ఉద్యోగుల సంఘం తరఫున ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఏలూరు సుబ్రహ్మణ్యం తెలిపారు

ఫౌజియా బేగంకు ఘన సన్మానం

విశాలాంధ్ర-పీలేరు: పీలేరు మండలం, అయ్యప్పరెడ్డి కాలనీలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా విజయవంతంగా సేవలందించిన ఫౌజియా బేగం పదవీ విరమణకు చేరుకోవడంతో ఆమెకు ఘనంగా సన్మానం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొని ఆమెకు సన్మానం చేసి, ఆమె సేవలను కొనియాడారు. ఈ సన్మాన కార్యక్రమం అనంతరం ఫౌజియాకి శాలువా కప్పి, జ్ఞాపికలు అందజేస గంగాధర్ వేణుగోపాల్‌రెడ్డి సురేంద్ర రెడ్డప్ప శోభ నాగరత్నమ్మ పార్వతమ్మ నటరాజ సావిత్రమ్మ, పాఠశాల ఉపాధ్యాయునిలో రేణుక విజయ్ కుమారి లోకనాథ్ గంగయ్య పాల్గొన్నారు.

ఉచిత మెడికల్ క్యాంప్ విజయవంతం

విశాలాంధ్ర-పీలేరు: 'మేము సైతం సమాజం కోసం' స్వచ్ఛంద సంస్థ పర్యవేక్షణలో ఏజే హాస్పిటల్ వారి సౌజన్యంతో ఉచిత మెడికల్ క్యాంప్‌ను నిర్వహించారు. ఆదివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఏజే హాస్పిటల్ లో కొనసాగింది. ఈ మెగా క్యాంపు లో ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎస్‌కెఅలీమ్, డాక్టర్ డి.జెనిఫర్ పాల్గొన్నారు. ఇందులో మొత్తం 129 మంది పౌరులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 'మేము సైతం సమాజం కోసం' స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు షైక్ షాహిన్షా, సంస్థ వైస్ ప్రెసిడెంట్ హసన్ భాష, సెక్రటరీ బుజ్జు (మోదిన్ బాషా), జాయింట్ సెక్రటరీ కలకడ బాబు, ట్రెజరర్ షాజహాన్, వర్కింగ్ సెక్రటరీ రిజ్వాన్, ప్రోగ్రాం ఇన్చార్జ్ ఆదిల్, జిల్లా ఇన్చార్జ్ పటాన్ సయ్యద్, ఆఫీస్ ఇన్చార్జ్ జావిద్, వాలంటరీ ఇన్చార్జ్ సుహెల్, కన్వీనర్ షమా తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీతో జడ్పీటీసీ బాలయ్య భేటీ

విశాలాంధ్ర-యర్రగుంట్ల: అన్నమయ్య జిల్లా రాయచోటీ నియోజకవర్గ పరిధిలోని లక్కిరెడ్డిపల్లె మండల పరిషత్ అధ్యక్షులు (ఎంపీపీ) సుదర్శన్‌రెడ్డితో ఎర్రగుంట్ల జడ్పీటీసీ సభ్యులు తమ్మిశెట్టి బాలయ్య ఆదివారం భేటీ అయ్యారు. ఇటీవల ఓ కేసులో సుదర్శన్‌రెడ్డి అరెస్టు అయి విడుదలైన నేపథ్యంలో బాలయ్య సంఘీభావంగా కలుసుకొని అరెస్టుకు దారితీసిన పరిస్థితులపై అడిగి తెలుసుకున్నారు. ఈ భేటీలో బాలయ్యతో పాటు పెద్దనపాడు గ్రామ సర్పంచ్ మార్లల సాంబశివారెడ్డి కూడా పాల్గొన్నారు.

అమర గాయకులు ఘంటసాల, ఎస్పీ బాలసుబ్రమణ్యం

- కళాంజలి సంస్కృతిక కళాపీఠం ఆధ్వర్యంలో అట్టహాసంగా రాష్ట్రస్థాయి సినీ గేయ పోటీలు
- గెలుపొందిన విజేతలకు సర్టిఫికెట్లు, మేమెంటోలు ప్రదానం
- ముఖ్య అతిథులుగా హాజరైన న్యాయవాది కాశీ విశ్వనాథ్
- ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్

విశాలాంధ్ర-రాజంపేట: తెలుగు ప్రజల హృదయాలలో చెరగని ముద్ర వేసుకున్న ప్రముఖ సినీ గాయకులు, గాన గాంధర్వులు స్వర్గీయ ఎస్పీ బాలసుబ్రమణ్యం 79వ జయంతి వేడుకలు సందర్భంగా ఆదివారం పట్టణ కేంద్రంలోని వైష్ణవి డిగ్రీ కళాశాల ప్రాంగణంలో కళాంజలి సాంస్కృతిక కళా పీఠం అధ్యక్షులు కళాంజలి, విజయకళ్యాణ్ ఆధ్వర్యంలో అట్టహాసంగా రాష్ట్రస్థాయి సాంస్కృతిక, సినీ గేయ పాటల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా న్యాయవాది కాశీ విశ్వనాథ్, ఏపీయూడబ్ల్యూజే అన్నమయ్య జిల్లా ఉపాధ్యక్షులు బచ్చోటీ భాస్కర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రముఖ సినీ గాయకులు, తన పాటల ద్వారా తెలుగు ప్రజల హృదయాలలో చెరగని ముద్ర వేసుకున్న గాన గాంధర్వుడు ఎస్పీ బాలసుబ్రమణ్యం, ఘంటసాల జ్ఞాపకార్థం రాజంపేటలో కళాంజలి సాంస్కృతిక కళా పీఠం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పాటల పోటీలను నిర్వహించడం హర్షణీయమన్నారు. ఈ పోటీలలో పాల్గొనేందుకు చిన్నపిల్లల నుండి పెద్దల వరకు ఉత్సాహంగా పాల్గొని వారి ప్రతిభను కనబరిచారన్నారు. నేటి ఆధునిక యుగంలో ఇలాంటి సాంస్కృతిక, సినీ గేయ పోటీలు నిర్వహించడం వల్ల సృజనాత్మక శక్తిని వెలికి తీయవచ్చు అన్నారు. అనంతరం కళాంజలి సాంస్కృతిక కళాపీఠం అధ్యక్షులు కళాంజలి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం రాజంపేటలో ప్రముఖ సినీ గాయకులైన ఘంటసాల, ఎస్పీ బాలసుబ్రమణ్యం జ్ఞాపకార్థం పాటల పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగానే ఈ ఏడాది కూడా రాజంపేటలో అత్యంత వైభవంగా సాంస్కృతిక, సినీ గేయ పోటీలను నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగానే వారి జ్ఞాపకార్థం గాన గాంధర్వుడు అవార్డును, ఎస్పీ బాలసుబ్రమణ్యం స్మారక స్వరార్చన అవార్డులను చెన్నైకి వెళ్లి స్వర్గీయ బాలసుబ్రమణ్యం తనయుడు ఎస్పీ చరణ్, ప్రముఖ గాయకురాలు సుశీలకు అందజేస్తామన్నారు. అనంతరం పాటల పోటీలలో గెలుపొందిన విజేతలకు సర్టిఫికెట్లు, మెమెంటో లను అందజేశారు. రానున్న రోజుల్లో రాజంపేట పట్టణ కేంద్రంలో ఎస్పీ బాలసుబ్రమణ్యం, ఘంటసాల విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. ముందుగా స్వర్గీయ ఘంటసాల, ఎస్పీ బాలసుబ్రమణ్యం చిత్రపటాలకు పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో న్యాయ నిర్ణీతలు ఆకాశవాణి కళాకారుల సంగీత విద్వాంసులు గుణకళ సుబ్బరాయుడు, నవోదయ సంగీత స్కూల్ విద్వాంసుడు వెంకటాద్రి, నిర్వాహకులు సత్యవతి దేవి, ఎస్ రాధిక వివిధ ప్రాంతాల నుండి వచ్చిన గాయనీ, గాయకులు పాల్గొన్నారు.

విధి వంచితుల జీవితాల్లో వెలుగు నింపుతున్న సిఎం రిలీఫ్ ఫండ్

- ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్

విశాలాంధ్ర-రైల్వేకోడూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధి విధి వంచితుల జీవితాల్లో వెలుగు నింపుతుందని ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్, కడప కుడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మెన్ తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ముక్కారూపానందరెడ్డి సతీమణి తెలుగు మహిళా నాయకురాలు ముక్కా వరలక్ష్మి పేర్కొన్నారు. చిట్వేల్ మండలానికి మంజూరైన సిఎం రిలీఫ్ ఫండ్ చెక్‌లను తీసుకుని భాదితుల నివాసాలకు వెళ్లి అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. నాగవరం గ్రామ పంచాయితీలోని చొప్పావారిపల్లి గ్రామానికి చెందిన కొమ్మిరెడ్డి గంగిరెడ్డి కి 49,665రూపాయలు, సిఎం రాచపల్లి గ్రామపంచాయతీకి చెందిన గుండాల శిరీష 3,91,068 లక్షల రూపాయలు, నగిరిపాడు గ్రామపంచాయితీలోని వెంకటరాజుపల్లి గ్రామానికి చెందిన కడిదల పద్మావతమ్మకు 30,786 రూపాయలు, గోగల రవీంద్ర కు 68,241 వేల రూపాయలు,పెద్దూరు గ్రామానికి చెందిన మాచినేని మునీశ్వర కు 45వేల రూపాయలు, నగిరిపాడుకు చెందిన షేక్ జైతున్ భీకి 2,79,185 లక్షల రూపాయలు,మార్గోపల్లికి చెందిన మన్నూరు రామసుబ్బారెడ్డికి 80వేల రూపాయలు, తిమ్మాయిపాళెం గ్రామ పంచాయతీలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన వల్లెం రవీంద్రయ్య కు20,524 వేల రూపాయలు, దేవమాచుపల్లి గ్రామ పంచాయతీలోని దొగ్గలపాడు గ్రామానికి చెందిన అకేపాటి వెంకటసుబ్బమ్మకు 45వేల రూపాయలు, చిట్వేల్ టౌన్ బ్రహ్మణవీధి కి చెందిన సిద్దారపు శివశంకర్ కు 37,000 వేల రూపాయలు, పెద్దిరెడ్డి శివారెడ్డి కి 1,93,531 లక్షల రూపాయలు అందజేసి వారిలో సంతోషాన్ని నింపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆనారోగ్య సమస్యలతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్న వారికి సిఎం రిలీఫ్ ఫండ్ భరోసా ఇచ్చిందన్నారు. అనుకోని ప్రమాదాలలో క్షతగాత్రులుగా మిగిలిన వారికి బాసటగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కట్టా ఉమాదేవి, బత్తిన వేణుగోపాల్ రెడ్డి, సంగరాజు రవికుమార్ రాజు, సర్పంచ్ గుత్తి నరసింహులు, రాహుల్ రెడ్డి, గుండాల్ రెడ్డి, శివారెడ్డి, రాయన ఆదిలక్ష్మమ్మ కార్యకర్తలు, నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు అంతర్ జిల్లా దొంగలు అరెస్ట్

- 25 లక్షల రూపాయల బంగారు నగలు స్వాధీనం

విశాలాంధ్ర-నందలూరు: మండలంలోని నందలూరు గ్రామ పంచాయతీ దుర్గాపురం క్రాస్ రోడ్డు వద్ద ముగ్గురు దొంగలను పట్టుకుని వారి వద్ద నుండి 250 గ్రాములు బంగారం (వీటి విలువ సుమారు 25 లక్షలు) 14 వేల రూపాయలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు రాజంపేట రూరల్ సిఐ బివి రమణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, రాజంపేట ఏఎస్పి మనోజ్ రామ్నాథ్ హెగ్డే సూచనల మేరకు ఎస్సై మల్లికార్జున రెడ్డి కి రాబడిన నమ్మకమైన సమాచారం మేరకు ఆదివారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో దుర్గాపురం క్రాస్ రోడ్డు వద్ద పోలీసులను చూసి ఆవుల సంజయ్య, ఆవుల ఈశ్వరమ్మ, ఆవుల ప్రమీల అనువారు బ్యాగులను పటుకుని ఉండి తమను చూసి పారిపోవుటకు ప్రయత్నించగా వారిని వెంబడించి పట్టుకొని వారి వద్ద నుండి 250 గ్రాముల బంగారం, 14 వేల రూపాయల నగదు స్వాధీనం చేసుకోవడం జరిగిందని అన్నారు. ఈ ముద్దాయిలు బ్యాగు దొంగతనాలు చేసే అంతర్ జిల్లాల దొంగల ముఠా అని తెలిపారు. ఈ ముద్దాయిలు శ్రీ సత్య సాయి జిల్లాకు చెందిన నంబుల పూల కుంట గ్రామానికి చెందిన వారు వీరి పైన నందలూరులో రెండు కేసులు, వేంపల్లి, పులివెందుల, అనంతపురం మూడవ టౌను, ఆర్లగడ్డ టౌన్, నంద్యాల వన్ టౌన్ లలో దొంగతనాలు చేశారని తెలిపారు. ముద్దాయిలపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. అంతర్ జిల్లాల దొంగలను చాతచక్యంగా పట్టుకొని ప్రతిభ కనబరిచిన ఎస్సై మల్లికార్జునరెడ్డి, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించినట్లు తెలిపారు. వీరి పేర్లను రివార్డ్ నిమిత్తం జిల్లా ఎస్పీకి సిఫారసు చేసినట్లు తెలిపారు.

జిల్లా స్థాయి యోగ సాధనకు ముగ్గురు ఎంపిక

విశాలాంధ్ర-నందలూరు: మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీకి చెందిన ముగ్గురు యోగ సాధనలో మండలం నుండి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. 35 నుండి 50 సంవత్సరాల విభాగంలో గెలివి నాగ సురేంద్ర కుమార్ మొదటి స్థానం, నీరజ రెండవ స్థానంలో నిలిచారు. అదేవిధంగా 18 సంవత్సరాల విభాగంలో ధోని చరణ్ మొదటి స్థానంలో నిలిచాడు. వీరిని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ శాలువాతో సత్కరించారు. జిల్లా స్థాయికి ఎంపికైన వీరిని మండలంలోని పలువురు అభినందించారు.